ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 21 జనవరి 2025

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



అర్జీల పరిష్కారంలో అశ్రద్ధ చూపొద్దు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై అశ్రద్ధ చూపకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి అందిన సమస్యలను అశ్రద్ధ చేయకుండా అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత కాల వ్యవధిలోపు పరిష్కరించాలని, అలాగే రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను కూడా పరిష్కరించాలని తెలిపారు.

గడువులోగా పరిష్కారం చూపండి : ఎస్పీ


అర్జీదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై అలసత్వం చేయకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు ఫిర్యాదులకు ప్రాధాన్యమిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి : ఏఎస్పీ

రాయచోటిటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏఆర్ పోలీసులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద గల పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాల పాటు నిర్వహించే మొబలైజేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర ఉద్యోగాల కంటే పోలీసు ఉద్యోగం భిన్నంగా ఉంటుందని, ప్రజలు మనపై పెట్టుకున్న ఆశలు ఏమాత్రం సడలకుండా క్రమశిక్షణతో మెలగాల్సి ఉంటుందన్నారు. ఏఆర్ సిబ్బందికి ప్రతిఏటా మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించి విధుల్లో నైపుణ్యం, ఫిజికల్ ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చడం ఆనవాయితీగా వస్తోందన్నారు. తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితాలిచ్చే విధంగా సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఫైరింగ్, డ్రిల్, కవాతు, మాబ్ కంట్రోల్, ప్రముఖుల బందోబస్తు తదితర విధులు మరింత సమర్థవంతంగా నిర్వహించేలా తర్ఫీదు ఇస్తారని తెలిపారు. మొబలైజేషన్‌కు వచ్చిన సిబ్బంది సంక్షేమం, ఆరోగ్య సమస్యలపై కూడా దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, ఆర్‌ఐలు, వీజే రామక్రిష్ణ, ఎం.పెద్దయ్య, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

పనులు చేయకుండానే..
నిధులు భోంచేశారు..!

● వైసీపీ ప్రభుత్వంలో ఆగడాలు
● రోజుకొక్కచోట వెలుగులోకి వస్తున్న వైనం
● విచారణ జరిపితే మరిన్ని బయటకు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి కంటే ఆ పేరుతో జరిగిన దోపిడీ ఎక్కువ అనేందుకు కొన్ని రోజులుగా బయటపడుతున్న అక్రమాలను చూస్తే తెలిసిపోతుంది. పనులు చేయకుండానే చేసినట్లు తప్పుడు రికార్డులు సృష్టించి జిల్లాలో కోట్ల రూపాయలు బిల్లులు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు గ్రామాల్లో రోడ్లు వేయకపోయినా వేసినట్లు.. అభివృద్ధి పనులు చేయకపోయినా.. చేసేసినట్లు.. దొంగ బిల్లులు చేసుకున్నట్లు వచ్చిన ఆరోపణలు విచారణలో వాస్తవమని తేలుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు పలు గ్రామ పంచాయతీలలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపిన అనంతరం ఆ సర్పంచ్‌లకు చెక్ పవర్‌ను కలెక్టర్ రద్దు చేయడంతో పాటు కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. వైసీపీ హయాంలో జరిగిన ఆగడాలు రోజుకొక్కటి జిల్లాలో ఏదో ఒక చోట బయటకు వస్తున్నాయి. అధికారులు విచారణ జరిపితే.. మరిన్ని అవినీతి, అక్రమాలు బయటకు వస్తాయని పలువురు డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలలో మచ్చుకు కొన్ని..

● సుండుపల్లె మండలంలో వైసీపీ పాలనలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ అనుచరులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు పనులు చేయకుండానే పెద్ద మొత్తంలో మండల నిధులు పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో సుమారు 80 లక్షల రూపాయల నుంచి కోటి వరకు పనులు చేయకుండానే బిల్లులు మార్చినట్లు తెలుస్తోంది. మట్టిరోడ్లు, పిచ్చి మొక్కల తొలగింపు, శానిటేషన్‌తో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు లక్షల్లో నిధులు డ్రా చేశారని ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులతో ఈ వ్యవహారం అంతా బట్టబయలైంది. దొంగ ఎం-బుక్కులు సృష్టించి నిధులు కాజేసినట్లు విచారణలో తేలింది. ఈ అక్రమ వ్యవహారంలో కొందరు అధికారులు కూడా కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది.

రోడ్డు వేయకుండానే.. నిధులు డ్రా

సుండుపల్లె మండలంలోని చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీలోని అప్పయ్యగారిపల్లెలో సీసీ రోడ్డు వేసినట్లు 1,77,975 బిల్లు చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా.. ఆ గ్రామ పంచాయతీలో సుమారు 30 లక్షలు నుంచి 40 లక్షల రూపాయల వరకు గత మూడు సంవత్సరాల్లో స్థానిక ప్రజాప్రతినిధి, అధికారులు పనులు చేయకుండానే.. చేసినట్లు సృష్టించి నిధులు మింగారని స్థానిక బీజేపీ నాయకుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. పెద్ద మొత్తంలోనే నిధులు దుర్వినియోగం అయ్యాయని నెల రోజుల క్రితం అధికారులు ధ్రువీకరించారు. అయితే ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

● వీరబల్లి మండలం సానిపాయి గ్రామ పంచాయతీలో స్థానిక టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు నిధుల దుర్వినియోగంపై అధికారులు విచారణ చేయగా సరైన బిల్లులు లేకుండా 1,96,400 రూపాయలు, నిబంధనలకు విరుద్ధంగా వివిధ కారణాలు చూపి తప్పుడు బిల్లులతో రూ.12,91,266 లక్షలు మొత్తం కలిపి రూ.14,87,666 లక్షలు అవినీతి జరిగినట్లు వెల్లడైంది. దీంతో సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా తొలగిస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఇదేకాకుండా ఇంకా పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో పాటు విజిలెన్స్ అధికారులు పరిశీలించి పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వనున్నారు. ఇదే మండలంలోని వంగిమళ్ల గ్రామంలోనూ నిధుల దుర్వినియోగంపై ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు రావడంతో అధికారులు విచారణ జరిపి స్థానిక సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. ఇక్కడ రూ.3,29,069 లక్షలు దుర్వినియోగం అయినట్లు విచారణలో అధికారులు తేల్చారు.

● పీలేరు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2021లో జరిగిన ఎన్నికల తరువాత ఏర్పాటైన పాలకవర్గం ఎటువంటి నిబంధనలు పాటించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ రూ.1.40 కోట్ల నిధులు దుర్వినియోగం చేశారని అధికారుల విచారణలో వెల్లడైంది. దీంతో ప్రస్తుత సర్పంచ్‌కు చెక్ పవర్ రద్దు కావడమే కాకుండా గతంలో పీలేరు ఈవోలుగా పనిచేసిన ముగ్గురు అధికారులు సస్పెండ్ అయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి అక్రమాలను వెలికి తీశారు. మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు నేతృత్వంలో సుమారు 22 రోజుల పాటు రికార్డులు పరిశీలించి పాలకవర్గం ఏర్పడిన తర్వాత మూడు కోట్ల రూపాయల వరకు దుర్వినియోగం అయినట్లు ధ్రువీకరించారు. జేఎల్‌ఆర్‌వీ ప్రసాద్ (చిత్తూరు జిల్లా సదుం మండల ఈవోపీఆర్‌ఆర్‌డీ), కేఆర్ ప్రసాద్ (వాల్మీకిపురం గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంటు), ఎస్‌ఏ గఫూర్ (కేవీపల్లె మండలం ఈవోపీఆర్‌ఆర్‌డీ)లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. పీలేరు సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేసి నిధులు డ్రా చేసే అధికారాన్ని ఈవోతో పాటు పీలేరు ఎంపీడీవోకు కట్టబెట్టింది. చెక్‌పవర్ రద్దుపై సర్పంచ్ హబీబ్‌బాషా హైకోర్టును ఆశ్రయించినా.. అతడికి ఉపశమనం కలగలేదు.

● మదనపల్లె మండలం సీటీఎం-2, బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె పంచాయతీల్లో డీఎల్‌పీవో నాగరాజు ఇటీవల విచారణ చేపట్టారు. పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకుని తన కార్యాలయానికి తెచ్చి విచారణ చేస్తున్నారు. ఈ రెండు పంచాయతీల్లో ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు, ఖర్చు చేసిన నిధులు, అందుకు సంబంధించిన బిల్లులు, ఓచర్‌లలో తేడా ఉన్నట్లు గుర్తించి నివేదికను కలెక్టర్‌కు పంపుతున్నట్లు డీఎల్‌పీవో తెలిపారు. ఇప్పటికే మదనపల్లె మండలంలోని కోళ్లబైలు-2 పంచాయతీలో విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు. మదనపల్లె మండలంలో ఇప్పటికే 16 పంచాయతీలు ఉండగా వైసీపీ ప్రభుత్వం 2021లో కొత్తగా పది పంచాయతీలు ఏర్పాటు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వీటిని విభజించి, వీటిలో నిధులు దుర్వినియోగం అయ్యాయని చిత్తూరు డీఆర్‌సీ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన కొత్తవారిపల్లె-2, బసినికొండ-2, కొత్తపల్లె-2, కొండామరిపల్లె, నారమాకులపల్లె తాండా, కోళ్లబైలు-2, సీటీఎం-2, పొన్నేటిపాళెం, కురవంక-2, ఈశ్వరమ్మకాలనీ పంచాయతీలలో విచారణ చేపట్టారు. తాజాగా సీటీఎం-2, కోళ్లబైలు-2 పంచాయతీలలో విచారణ చేపట్టి, నివేదికను కలెక్టర్‌కు పంపారు.


రోడ్డు వేయకుండానే బిల్లులు చేసుకున్న సుండుపల్లె మండలంలోని అప్పయ్యగారిపల్లె రోడ్డు




ఇప్పటికి బయటపడ్డవి కొన్నే..

వైసీపీ పాలనలో జిల్లాలోని అనేక గ్రామాలలో నిధులు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు పలు గ్రామాలలో స్థానిక నాయకులు ఫిర్యాదులు చేస్తుండడంతో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇంకా పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అక్రమాల పుట్టలు పగులుతాయని పలువురు పేర్కొంటున్నారు.

వాహనాల స్కామ్..!

● సెల్ఫ్ డ్రైవింగ్ పేరుతో అద్దెకు..
● మదనపల్లె కేంద్రంగా రవాణా
● కడప జిల్లాలో తాకట్టు..
● సిండికేట్‌గా.. నమ్మించి మోసం..



వివరాలు ... 6లో

'అయ్యో'ర్లపై రాఘవరెడ్డి తిట్ల దండకం

● నోరు తెరిస్తే బూతులు
● తన దయ ఉంటే ప్రమోషన్.. లేదంటే సస్పెన్షన్
● ప్రభుత్వం ఇచ్చిన నోటీసులో విస్మయం కలిగించే అంశాలు

తహసీల్దార్‌ల బదిలీలకు రంగం సిద్ధం!

● విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న తహసీల్దార్లకు స్థానచలనం
● పీజీఆర్ఎస్, కోర్టు కేసులపైనే అధికారుల దృష్టి
● త్వరలో ఉత్తర్వులు వచ్చే అవకాశం

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తహసీల్దార్ల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. విధుల్లో నిర్లక్ష్యంతో పాటు కోర్టు కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తహసీల్దార్లను బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక భూసమస్యలపైనే ప్రత్యేక శ్రద్ధ పెట్టిన విషయం తెలిసిందే. అయితే ఆరు నెలల క్రితమే తహసీల్దార్‌లను బదిలీ చేసి, డిప్యూటీ తహసీల్దార్లకు ఇన్‌చార్జి తహసీల్దార్లుగా పోస్టింగులు ఇచ్చారు. ఇందులో కొంతమంది సమర్థవంతంగా పనిచేయలేకపోయారనే వాదన బలంగా వినపడడంతో పీజీఆర్ఎస్, సివిల్ కోర్టుల్లో కేసుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న తహసీల్దార్‌లు బదిలీలు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. కొన్ని మండలాల నుంచి భూసమస్యలపై ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో జిల్లా అధికారులు చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారనే వాదన వినపడుతోంది. జిల్లాలో దాదాపు 15 మందికి డిప్యూటీ తహసీల్దార్లకు ఇన్‌చార్జి తహసీల్దార్లుగా బాధ్యతలు ఇచ్చినా అందులో కొంతమంది పరిపాలన సమర్థవంతంగా చేయలేకపోతున్నారని విమర్శలు బలంగా వస్తున్న నేపథ్యంలో వారి స్థానంలో రెగ్యులర్ తహసీల్దార్లను నియమించనున్నట్లు తెలుస్తోంది. మదనపల్లె, రాయచోటి డివిజన్లలో ఉన్న తహసీల్దార్లను బదిలీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. రాజంపేట డివిజన్‌లో కూడా ఒకటి, రెండు మండలాల్లో తహసీల్దార్లను బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ బదిలీలు రెండు మూడు రోజుల్లో జరుగుతాయని విశ్వసనీయ సమాచారం.

మళ్లీ సర్వేనా..!

● పెండింగ్‌లో 12 వేల దరఖాస్తులు ● అర్జీలుగా రానివి.. అంతకు రెండింతలు...
● ఒక్క సమస్యా పరిష్కరించకుండానే మళ్లీ రీసర్వే ● అర్జీలివ్వడంలోనే అలిసిపోతున్న రైతులు

గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో జరిగిన తప్పులను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న ఆశతో గ్రామసభలతో పాటు రెవెన్యూ సదస్సుల్లో రైతులు భారీగా అర్జీలు ఇచ్చారు. ఒక్క రీసర్వేపైనే జిల్లాలో 12 వేల అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇక గ్రామసభల వరకు వచ్చి అర్జీలు ఇవ్వని సమస్యలు మరో రెండింతలుంటాయని అంచనా. జిల్లాలో రైతులు ఇచ్చిన అభ్యంతరాల్లో ఒక్కదానికీ పరిష్కారం చూపకనే మిగిలిన గ్రామాల్లో సోమవారం నుంచి రీసర్వే మొదలుపెట్టారు.



కలికిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత విధానాలతో ఏకపక్షంగా నిర్వహించిన రీసర్వే చివరికి రైతులకు అనేక కొత్త చిక్కులను తెచ్చిన విషయం తెలిసిందే. రీసర్వే జరిగిన ఏ గ్రామంలోనూ రైతులు సంతృప్తి వ్యక్తపరచిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రీసర్వే రద్దు చేస్తామని, పాత రికార్డులను పునరుద్ధరించేవిధంగా చర్యలు తీసుకుంటామని, సర్వే జరగని గ్రామాల్లో రీసర్వే జరపబోమని హామీ ఇవ్వడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే హామీలకు విరుద్ధంగా ప్రస్తుతం తిరిగి రీసర్వే తెరమీదకు వచ్చింది. సోమవారం నుంచి జిల్లాలో ప్రతి మండలంలోనూ ఒక్కో గ్రామం వంతున సర్వే ప్రారంభించారు. అందుకు అవసరమైన 95 బృందాలతో పాటు రీసర్వే గురించి రైతుల్లో అపోహలు తొలగించి వారి భాగస్వామ్యం పెంచడానికి మరో 30బృందాలను అదనంగా ఏర్పాటు చేశారు. రీసర్వేలో జరిగిన తప్పులను గుర్తించడానికి అక్టోబరు-నవంబరు నెలల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. దీనికి సంబంధించి రైతుల నుంచి కుప్పలు తెప్పలుగా అభ్యంతరాలు వచ్చాయి. ఆ తరువాత నెల తిరగకుండానే మళ్లీ రెవెన్యూ సదస్సుల పేరుతో గ్రామసభలు నిర్వహించారు. రీసర్వేపై అభ్యంతరాలు మళ్లీ వెల్లువెత్తాయి. వీటన్నిటిని పరిష్కరించి మిగిలిన గ్రామాల్లో రీసర్వే చేపడతారని భావించినా గతంలో వచ్చిన అభ్యంతరాలపై ఎలాంటి చర్యలు లేకుండా కొత్తగా ఆమమేఘాలపై రీసర్వే ప్రారంభించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెండింగులో 12 వేల దరఖాస్తులు

ఈనెల 8వ తేదీ వరకు జరిగిన రెవెన్యూ గ్రామసభల్లో రీసర్వేకు సంబంధించిన అభ్యంతరాలు అర్జీల రూపంలో రైతులు అందజేశారు. జిల్లాలో ఈ మేరకు మొత్తం 11,943 దరఖాస్తులు రీసర్వేపై అందినట్లు రెవెన్యూ నివేదికలు చెబుతున్నాయి. ఇందులో అత్యధికంగా గుర్రంకొండ మండలం నుంచి 2068 అర్జీలు వచ్చాయి. ఆ తరువాత కలికిరి నుంచి 1232, తంబళ్లపల్లె నుంచి 1094, బి.కొత్తకోట నుంచి 911, రామాపురం నుంచి 743, పీటీఎం నుంచి 708, లక్కిరెడ్డిపల్లె నుంచి 583, నిమ్మనపల్లె నుంచి 563 దరఖాస్తులు అందాయి. మొత్తం మీద మదనపల్లె డివిజన్‌లో రెండు గ్రామసభల్లో కలిపి అత్యధికంగా 5861 మంది రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రాయచోటి డివిజన్ నుంచి 5377 అర్జీలు అందగా అత్యల్పంగా రాజంపేట డివిజన్ నుంచి 705 దరఖాస్తులు మాత్రమే అందాయి. ఇక్కడ గతంలో రీసర్వే పనులు మందకొడిగా జరిగిన కారణంగానే తక్కువ సమస్యలు వచ్చాయని చెబుతున్నారు. ప్రస్తుతం అందిన దాదాపు 12 వేల అభ్యంతరాలే కాకుండా గ్రామసభల గురించి అవగాహన లేక, తమ భూముల సర్వేలో లోపాలున్న విషయం తెలియని వారికి సంబంధించినవి కలుపుకుంటే మొత్తం 30 వేల అభ్యంతరాలుంటాయని అంచనా. మొత్తం రెండురకాల గ్రామసభలు పూర్తయి పది రోజుల పైబడి కావస్తున్నా ఇప్పటికీ కనీసం ఒక సమస్య కూడా పరిష్కారం కాలేదని తెలుస్తోంది. సోమవారం నుంచి ఇతర గ్రామాల్లో రీసర్వే ప్రారంభమవుతుందన్న కారణంగా మూడు రోజులుగా హడావిడిగా ఈ అర్జీలన్నింటినీ కంప్యూటర్లకు మాత్రం ఎక్కించగలిగారు. సబ్ కలెక్టర్ల చొరవతో దరఖాస్తులన్నింటినీ ఆయా డివిజన్ కేంద్రాలకు తీసుకెళ్లి అక్కడే కూర్చోబెట్టి ఆదివారం నాటికి పూర్తి చేయగలిగారు. ఇక వీటిని ఎప్పుడు పరిష్కరిస్తారన్న విషయంలో మాత్రం స్పష్టత లేదు.

సర్వే ఫీజు రద్దు

ఒక సర్వే నెంబరులో ఉన్న భూమిని కొలతలు వేసి సరిహద్దులు చూపించడానికి ఒక్కో సర్వే నెంబరుకు రూ.550 ఫీజు రైతులు ముందుగా చెల్లించాల్సి ఉంటుంది. ఒక రైతు తనకున్న పది నెంబర్లు సర్వే చేయించాలంటే రూ.5500 ఫీజు అవుతుంది. అయితే రీసర్వేల కారణంగా వచ్చిన అభ్యంతరాలకు సంబంధించి రైతులు కోరినట్లు సర్వే చేయడానికి ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆరు నెలల వరకు మాత్రమే ఈ వెసులుబాటు అమల్లో ఉంటుంది. రీసర్వే బాధిత రైతులకు ఇది చెప్పుకోదగ్గ ఉపశమనంగానే చెపుతున్నారు.

క్షేత్రస్థాయిలో కనిపించని జిల్లా అధికారుల ఆదేశాలు

రైతుల భాగస్వామ్యం పెంచి పూర్తి సంతృప్త స్థాయిలో రీసర్వే పూర్తి చేయాలనే లక్ష్యంగా జిల్లా అధికారులు అనేక రకాల దిశా నిర్దేశం చేశారు. అయితే వారు ఊహిస్తున్నట్టుగా క్షేత్ర స్థాయిలో ఈ ప్రయత్నాలు కనిపించడం లేదని చెబుతున్నారు. రైతుల్లో అవగాహన పెంచి రీసర్వేలో వారు ప్రత్యక్షంగా భాగస్వాములయ్యేందుకు చేయాల్సిన కృషి చెప్పుకోదగ్గ స్థాయిలో కనపడటం లేదని అంటున్నారు. మొత్తం మండలంలో రీసర్వేని పర్యవేక్షించి శాఖల మధ్య సమన్వయం సాధించడానికి ఒక జిల్లా స్థాయి ప్రత్యేక అధికారిని నియమించినా వారు కూడా అంటీ ముట్టనట్టున్నారని చెబుతున్నారు. సర్వే జరిగే తీరు ఎలా ఉన్నా దాని విజయం అంతిమంగా రైతుల సంతృప్తిపైనే ఆధారపడి ఉంటుందని అంటున్నారు.


రామాపురం మండలం నల్లగుట్టపల్లెలో భూరీసర్వే చేస్తున్న దృశ్యం

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంచాలి

● ఉపాధ్యాయుల శిక్షణలో డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటి టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల అర్చనా విద్యాసంస్థల్లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు చేపట్టిన 8వ బ్యాచ్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫౌండేషన్ అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్‌ఎల్‌ఎన్) సమర్థవంతమైన విద్యకు మూల స్తంభాలన్నారు. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపు ప్రత్యేక లక్ష్యంగా ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌బాబు మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ వరకు శిక్షణ జరుగుతుందని, శిక్షణలో జిల్లా వ్యాప్తంగా 480 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారన్నారు. అర్చనా విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పి.మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ ఏఎంవో సమీవుల్లా, ఎఫ్‌ఎల్‌ఎన్ కో-ఆర్డినేటర్ రాజశేఖర్, ఐఈ కో-ఆర్డినేటర్ జనార్దన్, మండల విద్యాశాఖ అధికారులు రామకృష్ణ, నాగార్జున, సీఆర్‌పీ శ్యామల, పీడీ వీరాంజి, రిసోర్స్ పర్సన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి


మృతిచెందిన యువకుడు

పెద్దమండ్యం, జనవరి 20(ఆంధ్రజ్యోతి) అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన పెద్దమండ్యం మండలం కలిచెర్లలో సోమవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కలిచెర్ల గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌షరీఫ్ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి తోడుగా ఉంటున్న ఆయన కుమారుడు ఉస్మాన్ (20) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కలిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక సమీపంలో ఉన్న చింతచెట్టు కింద సోమవారం అనుమానాస్పద స్థితిలో శవమై పడివున్నట్లు గ్రామస్థులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు పెద్దమండ్యం పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలంలో వున్న ఉస్మాన్ మృతదేహాన్ని పరిశీలించారు. ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి మృతి చెంది ఉంటాడని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శవ పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రమణ తెలిపారు. మృతుడి తండ్రి ఖాదర్‌షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉదయగిరిలో రాజంపేట వాసి మృతి


మృతిచెందిన శంకరయ్య

ఉదయగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఉదయగిరి పట్టణంలో సోమవారం రాజంపేటకు చెందిన శంకరయ్య మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. శంకరయ్య రెండేళ్లుగా ఉదయగిరిలో ప్లాస్టిక్ సామగ్రి, చిత్తు కాగితాలు పోగు చేసి విక్రయించి జీవిస్తున్నాడు. స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న పాత సామాన్లు కొనుగోలు చేసే దుకాణం వద్దే నివసిస్తున్నాడు. అక్కడే సోమవారం మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. శంకరయ్య రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, అతనికి మద్యం అలవాటు కూడా ఉందని స్థానికులు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సిద్దవటం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం సమీపాన నేషనల్ హైవేపై జనవరి 15న రాత్రి గుర్తు తెలియని వ్యక్తిని(50) ఓ వాహనం ఢీకొనడంతో అతనికి బలమైన గాయాలయ్యాయి. దీంతో స్థానికులు, హైవే పెట్రోలింగ్ పోలీసులు 108 వాహనంలో మెరుగైన వైద్యం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా చికిత్స తీసుకుంటూ సోమవారం ఉదయం మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించడంతో మార్చురీకి తరలించామని స్థానిక పోలీసులు తెలిపారు. ఎవరైనా మృతిచెందిన వ్యక్తిని బంధువులు గుర్తుపడితే వెంటనే రావాలని పోలీసులు తెలియజేశారు.

కోడిపందేల నిర్వహణపై ఎస్‌బీ పోలీసుల విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కురబలకోట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడు సమీపంలో జోరుగా కోడిపందేలను బహిరంగంగా ఆదివారం నిర్వహించడంపై ఎస్‌బీ పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం 'జోరుగా కోడి పందేలు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఎస్‌బీ అధికారులను ఆదేశించడంతో ఆ మేరకు విచారణ చేపట్టారు. దీంతో ముదివేడు చుట్టుపక్కల విచారించి నివేదికను ఎస్పీకి అందజేశారు.

శిబ్యాల పంచాయతీ కార్యదర్శి బదిలీ

కలికిరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండలంలోని శిబ్యాల గ్రామ పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శి కాశెట్టి నాగరాజ రాజు గుంటూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులిచ్చింది. తగు చర్యలు తీసుకొనేందుకు పంచాయతీ రాజ్ కమిషనర్‌ను ప్రభుత్వం అనుమతించింది. బదిలీలపై ప్రస్తుతం అమల్లో నిషేధాన్ని సడలిస్తూ మానవతా దృక్పథంతో చేసిన ఈ బదిలీకి సంబంధించిన ఉత్తర్వును పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ జీవో జారీ చేశారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపికలు

కడప స్పోర్ట్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజీవ్‌మార్గ్ రోడ్డులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 బుధవారం ఉదయం సీనియర్స్ మహిళల..పురుషుల కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, జనార్ధన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి వుంటుందన్నారు.

వాహనాల స్కామ్..!


బైపాస్ రోడ్డులో అమ్మకానికి సిద్ధం చేసిన వాహనాలు

రోజురోజుకు వాహనాల స్కామ్ ఎక్కువవుతోంది. మదనపల్లెకు చెందిన కొందరు ఓ ముఠాగా ఏర్పడి ఈ తతంగం నడిపిస్తున్నట్లు సమాచారం. సెల్ఫ్ డ్రైవింగ్ పేరుతో కార్లను అద్దెకు తీసుకొని.. ఆపై ఉడాయిస్తున్నారు. ఆ వాహనాలను తాకట్టు పెట్టి సొమ్ము చేసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. మదనపల్లె కేంద్రంగా ఇదంతా జరుగుతున్నట్లు తెలుస్తోంది. వాహన యజమాని బాడుగ వస్తే చాలని ఎవరికి పడితే వారికి అద్దెకు ఇవ్వడంతో ఈ మోసాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు. చివరకు బాధితులు చేసేది లేక పోలీసులను ఆశ్రయిస్తూ లబోదిబోమంటున్నారు.

- సెల్ఫ్‌డ్రైవింగ్ పేరుతో అద్దెకు..
- మదనపల్లె కేంద్రంగా రవాణా
- కడప జిల్లాలో తాకట్టు..
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- సిండికేట్‌గా.. నమ్మించి మోసం..

మదనపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇదో కొత్త రకమైన వాహనాల స్కామ్. మదనపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి వాహన యజమానులు, వాహనాల పార్కింగ్ కేంద్రాలు, ట్రావెల్స్ నుంచి కారు, సుమో, ఇన్నోవా, స్కార్పియో, తదితర రకాల వాహనాలను రోజువారీ, నెలవారీ అద్దెకు తీసుకుంటున్నారు. సెల్ఫ్ డ్రైవింగ్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ఇంజనీరింగ్ పనుల వద్ద సైట్లలో, తదితర రకాల పేరుతో అద్దెకు తీసుకుంటారు. మొదట్లో రెండు, మూడు రోజులు అద్దె చెల్లిస్తారు. ఇంకా అవసరమైతే.. టూర్, ఇతర అవసరాల పేరుతో వారం, పదిహేను రోజులు పొడిగిస్తారు. అనంతరం అవసరాన్ని బట్టి బయటి ప్రాంతంలో ఒక్కో వాహనాన్ని రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు తాకట్టు పెట్టి రుణం తీసుకుంటున్నారు. రుణదాతలకు వడ్డీ చెల్లిస్తూ, వీటిని ష్యూరిటీగా పెడుతున్నారు. పని కాగానే, అప్పు చెల్లించి వాహనాన్ని రిలీజ్ చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. అయితే తాము అనుకున్న పని కానప్పుడు సీన్ రివర్స్ అవుతోంది. దీంతో యజమానికి సమాధానం చెప్పలేక చివరకు కటకటాల పాలవుతున్నారు. ఆ లోగా వాహనం జాడ యజమానికి తెలిస్తే, బంధువులు లేక అయిన వారో తీసుకెళ్లారని బుకాయిస్తారు. అప్పటికీ వాహనం ఇంటికి రాకుంటే పోలీసులను ఆశ్రయించి, వాహనం చోరీ అయిందనో లేక అద్దె పేరుతో తీసుకెళ్లి పరారయ్యాడని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు.

మదనపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు మదనపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, పీలేరు ఏరియాలలో రోజువారీ అద్దెకు, నెలవారీ బాడుగ పేరుతో తీసుకెళ్లి కడప జిల్లా చక్రాయపేట, గండి, వేంపల్లె, ప్రొద్దుటూరు, పులివెందుల, తదితర ప్రాంతాల్లో తాకట్టు పెడుతున్నారు. మదనపల్లె కేంద్రంగా కొన్నేళ్లుగా కొనసాగుతున్న దందాలో ఎక్కడో ఇటీవల బెడిసికొట్టడంతో వెలుగులోకి వచ్చింది. అలాగే హైదరాబాద్ కేంద్రంగా కూడా అక్కడి ఏజెంట్లు మదనపల్లెకు తెచ్చి ఇలాంటి అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు ఇటీవల బయట పడింది. కేసులు, పోలీసుల వరకూ వెళ్లినవి కొన్నే అయితే, వెలుగులోకి రానివి మరెన్నో ఉన్నట్లు వాహన, ట్రాన్స్‌పోర్టు యజమానులు చెబుతున్నారు.


మదనపల్లెలోని ఓ పార్కింగ్ కేంద్రంలోని వాహనాలు

మదనపల్లెకు చెందిన ముగ్గురు వాహన యజమానులు వారం రోజుల క్రితం తమ వాహనాలు కనిపించలేదని తాలూకా పోలీసులను ఆశ్రయించారు. చివరకు వాహనాల జాడ తెలుసుకున్న బాధితులు.. పోలీసులతో కలిసి 20 మంది యువకులు రెండు వాహనాల్లో కడప జిల్లా చక్రాయపేటకు వెళ్లారు. అక్కడ వారి వాహనాలు కలిగి ఉన్న వ్యక్తులను ప్రశ్నిస్తే మదనపల్లెకు చెందిన ఓ వ్యక్తి తమకు తాకట్టు పెట్టాడని తెలిపారు. ఆ వాహనాలు తమవని మీరెలా తాకట్టు పెట్టుకుంటారని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన వాహన రికార్డులను వాహన యజమానులు చూపిస్తే, తాకట్టు పెట్టుకున్నట్లు మధ్యవర్తి ద్వారా రాయించుకున్న రికార్డులు వారూ చూపించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారితీసింది. ఈ విషయం చక్రాయపేట మండలంలో దావానంలా వ్యాపించింది. ఈ క్రమంలో ఇలాంటి అద్దె వాహనాలను తాకట్టు పెట్టుకున్న వారంతా ఏకమయ్యారు. చివరికి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఈ పంచాయితీ కాస్త అక్కడి చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌కు చేరింది. మీకు వాహనాలు ఇచ్చేది లేదని, మీరు ఎవరికి అద్దెకు ఇచ్చారో వారిని తీసుకురావాలని పట్టుబట్టారు. మీకు బండ్లు ఇస్తే.. మేం ఇచ్చిన డబ్బులు ఎవరిస్తారని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితిల్లోనూ వాహనాలు ఇవ్వమని తెగేసి చెప్పారు. చివరకు వాహనాలు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో పెట్టడంతో మదనపల్లె నుంచి వెళ్లిన 20 మందితో పాటు ఇద్దరు కానిస్టేబుల్స్ తిరిగి ఖాళీగా మదనపల్లెకు వచ్చేశారు. ఇదిలా వుండగా పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకెళ్లిన 67 వాహనాలను కడప జిల్లా చక్రాయపేట, తదితర ప్రాంతాలకు రవాణా చేశారంటే.. వాహనాల స్కాం ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

చక్రాయపేట మండలంలోని కుప్పగుట్టపల్లె, నాగులగుట్టపల్లె, చిలేకాంపల్లె, దేవరగుట్టపల్లె, తదితర గ్రామాల్లో తాకట్టు పెట్టిన వాహనాల్లో మూడింటిని రుణదాతలకు తెలియకుండా మధ్యవర్తులు దొంగగా తెచ్చేసినట్లు చెబుతున్నారు. తాము ఎక్కడెక్కడ, ఎవరెవరికి వాహనం ఇచ్చిందీ వారికి తెలుసు. ఈ నేపథ్యంలో వాహనం ఎక్కడ తిరుగుతోందో, రాత్రివేళలో ఎక్కడ పార్కింగ్ చేస్తారో జీపీఎస్ ట్రాక్ ద్వారా ముందుగానే పసిగడతారు. అసలే చలికాలం.. రాత్రివేళలో ఇంట్లో నిద్రిస్తున్న వేళ అప్పటికే తమ వద్ద సిద్ధంగా ఉంచుకున్న రెండో కీ ద్వారా తెచ్చేస్తున్నారు. తెల్లవారి చూసుకున్న బాధితులు లబోదిబోమంటున్నారు. అప్పటి వరకూ జీపీఎస్ ట్రాక్ విషయం తెలియని వారంతా.. అలెర్ట్ అయ్యారు. తాకట్టు పెట్టుకున్న మిగిలిన వాహనాలను మెకానిక్ వద్దకు తీసుకెళ్లి, ట్రాకింగ్ సిస్టమ్‌ను తీసేస్తున్నారు. ఇలా ఒకదాని తర్వాత మరొకటి బయట పడుతుండటంతో వారూ అలెర్ట్ అయ్యారు. వారూ తమ డబ్బులు వచ్చేంత వరకూ వాహనాలను ఊర్లేకాదు.. జిల్లాలను దాటిచ్చేస్తున్నట్లు సమాచారం.

తక్కువకు వస్తోందని..

రూ.5 లక్షలు, రూ.10 లక్షలు విలువ చేసే వాహనం రూ.లక్ష, రూ.లక్షన్నరకు తాకట్టు పెడుతుండటంతో డ్రైవింగ్ నేర్చుకునే, సరదాగా టూర్‌వెళ్లే, హోదాకు చిహ్నంగా భావించే.. ఇలా ఒకరిని చూసి మరొకరు వాహనాలను తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. తక్కువ ధరకు రావడం, కొందరైతే వడ్డీకి ఇచ్చే సొమ్ములకు ష్యూరిటీగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు. కొన్నిచోట్ల వాహన యజమాని, మీడియేటర్ ముఠాగా ఏర్పడుతున్నారు. వాహనాన్ని మూడో వ్యక్తికి తాకట్టు పెట్టి, వాహనం చోరీ అయిందని పోలీసులకు ఫిర్యాదు చేస్తారు. ఆలోగా మధ్యవర్తి కనిపించకుండా పోవడం, కేసుల భయంతో డబ్బులిచ్చిన వారు మాత్రం.. కేసు లేకుండా వాహనం వదిలేయాల్సిన పరిస్థితి కూడా ఉంటోంది. తాకట్టు సొమ్మును మధ్యవర్తి, వాహన యజమాని పంచుకుంటున్నట్లు కూడా చెబుతున్నారు. అలాగే కొన్నిచోట్ల చోరీ, రికార్డులు లేని వాహనాలు వచ్చిన కాడికి రానిలే అన్నట్లు ఎంతో కొంతకు మార్టిగేజ్ పెట్టేసి సొమ్ములు తీసుకుంటున్న ఉదంతాలు కూడా ఉన్నాయి.

సీన్ కట్ చేస్తే.. వాల్మీకిపురంలో..

తమకు వచ్చిన ఫిర్యాదులపై తాలూకా పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా, ఇదే తరహాలో వాల్మీకిపురం నుంచి కూడా వాహనాలను అద్దెకు తీసుకెళ్లి చక్రాయపేట మండలంలో తాకట్టు పెట్టినట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై వాల్మీకిపురం పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిచ్చిన సమాచారం మేరకు చక్రాయపేటకు వెళ్లి, అక్కడ తాకట్టు పెట్టిన వాహనాలను తీసుకొచ్చారు. ఇలా వాహనాలను ఎక్కడెక్కడ అద్దెకు తెచ్చారో, ఎక్కడ తాకట్టు పెట్టారో పోలీసులు విచారణ చేస్తున్నారు. అయితే ఇలా అద్దె వాహనాలను తాకట్టు పెట్టే ముఠాతో పోలీసులకు సంబంధాలు ఉన్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. కొన్ని కేసుల్లో వీరినే పోలీసులు ఇన్‌ఫార్మర్లుగా వాడుకుంటున్నట్లు చెబుతున్నారు.

పొలానికి వెళ్లి తిరిగి వస్తూ.. అనంత లోకాలకు

- ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు
- ఒకరు మృతి, మరొకరికి గాయాలు

సంబేపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వారు ఇద్దరూ అన్నదమ్ములు. సొంత ట్రాక్టర్ తీసుకొని పొలం దున్నకాలకు వెళ్లారు. పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో వస్తూ ఉండగా కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి గుట్టపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు ఖాదర్‌వల్లి (25)ని కబలించింది. అతని సోదరుడు సాయిపీర్ తీవ్రగాయాలతో కాలు విరిగిన సంఘటన చోటు చేసుకుంది. సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం కట్టుగుత్తపల్లెకు చెందిన ఖాదర్‌వల్లి, సాయిపీర్ ఇరువురూ సోమవారం ఉదయం సదుం సమీ పంలో పొలం దున్నకాలకు వెళ్లినట్లు తెలిపారు. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో వస్తూ ఉండగా కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి గుట్టపల్లి సమీపంలో రాగానే కలకడ వైపు నుంచి వస్తున్న కారు ట్రాక్టర్‌ను వెనుకభాగంలో ఢీకొనడంతో ట్రాక్టరు బోల్తాపడింది. కారు రోడ్డు సైడ్ దిగింది. కారులో ఉన్న వ్యక్తులకు స్వల్పగాయాలు కాగా ట్రాక్టర్‌లో ఉన్న అన్నదమ్ములు ఇరువురిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి కాలు విరిగి రక్తగాయాలైనట్లు తెలిపారు. స్థానికులు మృతుని కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందజేయడంతో ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో మృతుని బంధువులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు.


బోల్తాపడిన ట్రాక్టర్, రోడ్డు సైడుకు దూసుకెళ్లిన కారు

పొలంలో బయటపడ్డ పురాతన విగ్రహాలు


పురాతన విగ్రహాలు

తంబళ్లపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోటకొండలో ఓ రైతు పొలంలో రెండు పురాతన రాతి దేవతా విగ్రహాలు బయటపడ్డాయి. గ్రామస్థులు వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం కోటకొండ పంచాయతీ మద్దిరాలపల్లె సమీపంలో ఎన్.రంగారావుకు చెందిన భూమిని ఇదే పంచాయతీ ఏటిగడ్డపల్లెకు చెందిన వెంకటేష్ కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం టమోటా నాటేందుకు భూమిని ట్రాక్టర్‌తో దుక్కి దున్నించాడు. సోమవారం ఉదయం దుక్కి దున్నిన పొలంలో రైతు నడుచుకుని వెళుతుండగా ఎత్తుగా రాయి ఉన్నట్లు కనిపించింది. దీంతో వెంటనే రాయిని వెలికితీసి పరిశీలించగా సుమారు ఒకటిన్నర అడుగు పొడవు, అడుగు వెడల్పు ఉన్న రెండు రాతి విగ్రహాలు బయల్పడ్డాయి. ఇందులో ఒక విగ్రహం రామానుజాచార్యులది కాగా, మరో విగ్రహం అమ్మవారిది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయం గ్రామస్థులకు తెలియడంతో తండోప తండాలుగా వెళ్లి విగ్రహాలను ఆసక్తిగా తిలకించారు. విగ్రహాలను శుభ్రపరచి పసుపు పూసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కాగా, విగ్రహాలు బయటపడిన పొలానికి సమీపంలో పూర్వం ఓ చిన్న చెరువు ఉండేదని, అప్పట్లో కురిసిన వర్షాలకు ఆ చెరువు కట్ట తెగిపోయి కిందనే ఉన్న ఆలయంపై మట్టి పడి అందులో ఉన్న విగ్రహాలు పూడిపోయి ఉంటాయని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాలు సుమారు 300 ఏళ్ల క్రితం నాటివి ఉండవచ్చని గ్రామస్తులు అనుకుంటున్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

మదనపల్లెఅర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు.. మదనపల్లె మండలం, టీకులపాలెంకు చెందిన నరసింహులు (42) సోమవారం ఉరివేసుకుని మృతి చెందాడు. ఆరునెలల క్రితం భార్య తులసీ కుటుంబ కలహాలతో పుట్టిల్లు కోళ్లవారిపల్లెకు వెళ్లి తిరిగి కాపురానికి రాలేదని మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించే లోపే మృతి చెందాడని, వెంటనే మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'అయ్యో'ర్లపై రాఘవరెడ్డి తిట్ల దండకం

- నోరు తెరిస్తే బూతులు, దుర్భాషలు
- తన ప్రాపకముంటే ప్రమోషన్ లేదంటే సస్పెన్షన్
- ప్రభుత్వమిచ్చిన నోటీసులో విస్మయం కలిగించే అంశాలు

కలికిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): "అరె.. యూస్‌లెస్ ఫెలో.. పనికిమాలిన గాడిద కొడకా.. అరె మెంటల్.." ఈ తిట్లు పడ్డవారు ఎవరో కాదు సాక్షాత్తు గౌరవప్రదమైన వృత్తిలో వున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు. తిట్టిన వారెవరో కాదు.. వై.రాఘవరెడ్డి. కడప జిల్లా కేంద్రంగా డీఈవోగా, ప్రాంతీయ సంయుక్త సంచాలకుడిగా ఉన్నత స్థాయిలో పనిచేస్తూ విద్యా వ్యవస్థను పర్యవేక్షించాల్సిన అధికారి. ఇవన్నీ కల్పిత ఫిర్యాదులు కూడా కావు. సాక్షాత్తు రాష్ట్ర గవర్నరుకు అందిన ఫిర్యాదుపై ఇద్దరు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు కూలంకషంగా విచారణ చేసి రుజువులతో సహా తేల్చిన నిజాలు. ఈ విషయాలన్నిటిని కూడా సాక్షాత్తు ప్రభుత్వమే వెల్లడించింది. రాఘవరెడ్డిపై వచ్చిన అభియోగాల గురించి ప్రభుత్వ పరంగా విచారణ జరపడం కోసం ఆదివారం ఆయనకు జారీ చేసిన నోటీసులో విస్తుగొలిపే పలు అంశాలున్నాయి. అవి యథాతథంగా.. నందలూరు మండలం పొత్తపి పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.వెంకట్రమణకు ఫోను చేసి "యూస్‌లెస్ ఫెలో, పనికిమాలిన గాడిద కొడకా, మెంటలా.. చట్ట విరుద్ధంగా పనిచేసున్నావు.. మెంటలా" అంటూ దుర్భాషలాడాడు. తరువాత అదే స్కూల్లో పనిచేసే ఆయన భార్యతో అతడికి అన్నం పెట్టొద్దు. పిల్లలను జాగ్రత్తగా చూసుకోమంటూ సలహా ఇచ్చాడు. రాష్ట్ర ఎస్‌సీఈఆర్టీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి కేశవరెడ్డికి ఫోను చేసి గాడిదనాకొడకా అంటూ దూషించాడు. ఇక కడపలోని చంద్రమౌళి విద్యాలయం కరస్పాండెంట్‌ను చెప్పలేని భాషలో దురుసుగా మాట్లాడాడు.

పరిపాలనాపరమైన అక్రమాలు

ఇవన్నీ ఒక కోణంలోనివి కాగా పాలనాపరమైన పలు అంశాల్లో ఆయన నియమాలను అతిక్రమించి వ్యవహరించినట్లు ప్రభుత్వం పేర్కొంది. లింగాల మండల వెలిదండ్ల పాఠశాల హెచ్ఎం బి.మురళీకృష్ణకు నాడు-నేడు పనులతో ఎలాంటి సంబంధం లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశాడు. నాగులగుట్టపల్లె టీచర్ ఎస్.రామమోహన్ ఒక ఆర్టీసీ డ్రైవర్ గొడవపడిన కారణంగా సస్పెండ్ చేశాడు. వాస్తవానికి ఇది పూర్తిగా ప్రైవేటు వ్యవహారం. కనీసం దీనిపై పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కూడా లేదు. సస్పెండ్ చేయాలంటే కేసు నమోదై కనీసం 48 గంటలు పోలీసుల కస్టడీలో వుండాలి. అయినా సస్పెండ్ చేయడం విరుద్ధమంటూ ప్రభుత్వం పేర్కొంది. ఇక ఒక ఉన్నతాధికారిగా అనేక నియమాలను అతిక్రమించారనేది మరి కొన్ని ఆరోపణలు. పుల్లంపేట మండలం రామసముద్రం హెచ్ఎం వి.పొట్టిరెడ్డిని ఆయన అభ్యర్థనపై నియమ విరుద్ధంగా 16 శాతం ఇంటి అద్దె అలవెన్సు వచ్చే విధంగా బదిలీ చేశాడు. అదే విధంగా 16 శాతం హెచ్ఆర్ఏ కోసం రాజంపేట మండలం పలపుత్తూరు హెచ్ఎం వై.హేమలతను కంచర్లపల్లెకు, మరో హెచ్ఎం బి.ఆనందనాయక్‌ను పుల్లంపేట మండలం రెడ్డిపల్లె నుంచి రాయచోటికి, వై.సుశీలను వీరబల్లి మండలం లగ్గిశెట్టిపల్లె నుంచి పదోన్నతి మీద కుమ్మరపల్లెకు బదిలీ చేశారు. పెనగలూరు నుంచి వి.వెంకటేశ్వర్లును కౌన్సెలింగ్‌లో ఖాళీ లేకున్నా బెదిరించి జి.కె.రాచపల్లెకు బదిలీ చేశారు. కౌన్సెలింగ్‌లో అదనపు పాయింట్ల కోసం తప్పులు చేసిన కలసపాడు మండలం ఎగువరామాపురం టీచర్ అర్లి విజయలక్ష్మిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకోకుండా అలసత్వం వహించాడు. అదే విధంగా అదే పాఠశాలకు చెందిన హెచ్ఎం మస్తాన్‌వల్లిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపకుండా నిర్లక్ష్యం వహించాడు. కౌన్సెలింగ్‌కు హాజరుకాకపోయినా పట్టణ ప్రాంతంలో నియమించాడు. చెన్నూరు మండలం దౌలత్‌పురం టీచరు కె.రమణారెడ్డిని కన్సిస్టెంట్ రెయిమ్స్ నోడల్ అధికారిగా, కడప అశోక్‌నగర్‌కు చెందిన రమేష్‌బాబును స్కూల్ సేఫ్టీ జిల్లా మానిటరింగ్ అధికారిగా ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే నియమించారు. కౌన్సెలింగ్ కోసం తప్పుడు వివరాలు సమర్పించిన వారిని ప్రాసిక్యూషన్ చేయాలనే నిబంధనలున్నా వారిని కనీసం ఖాళీలున్న మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాల్సి వున్నా పట్టించుకోకపోవడం వంటి అభియోగాలతో రాఘవరెడ్డిపై ప్రభుత్వం విచారణకు సిద్ధమవుతోంది. పది రోజుల్లోగా ఆయన నుంచి సంజాయిషీ అందిన అనంతరం తగు చర్యలు తీసుకోనున్నారు. కాగా రాఘవరెడ్డి వ్యవహారశైలి గురించి ప్రభుత్వం ఆపాదించిన అభియోగాల గురించి జిల్లాల్లోని ఉపాధ్యాయ వర్గాల్లో విస్తృత చర్చ నడుస్తోంది.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మైదుకూరురూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో సోమవారం అక్రమరవాణాకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు డీఆర్‌ఓ అన్సర్‌హుస్సేన్ తెలిపారు. జిల్లా అటవీ శాఖాధికారి వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు వనిపెంట సమీపంలోని నల్లమల అడవిలో ఫారెస్ట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రవాణాకు సిద్ధంగా ఉంచిన 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అదుపులోకి తీసుకోగా.. కొందరు పారిపోయినట్లు తెలిపారు. నిందితుల పేర్లు, వారి సమాచారం గోప్యంగా ఉంచారు. కార్యక్రమంలో వనిపెంట ఫారెస్ట్ రేంజర్ ప్రణీత్ రావు, అన్వర్‌హుస్సేన్, బీట్ ఆఫీసర్లు సుచరిత, గంగాధర్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.


ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొన్న ఫారెస్ట్ అధికారులు

పారదర్శక సేవలు... ప్రగతికి అడుగులు

- స్వర్ణ పంచాయతీ పేరిట కూటమి సర్కార్ శ్రీకారం
- గ్రామాల ఆదాయ వనరులు నమోదు
- అందుబాటులోకి వస్తే పౌరసేవలు సులభతరం

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. స్వర్ణ పంచాయతీ పేరిట ఆన్‌లైన్ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రతి చెల్లింపు ఆన్‌లైన్‌లో నిర్వహించేలా డిజిటలైజేషన్ చేస్తున్న నేపథ్యంలో పంచాయతీల్లో పారదర్శకత, జవాబుదారితనం పెరగనుంది. వివరాల్లోకి వెళితే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయి. ఎటువంటి అభివృద్ధి పనులకు నోచుకోలేదు. మౌలిక వసతుల కల్పన కుంటుపడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామాల సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. పంచాయతీల్లో అక్రమాల నిరోధానికి చర్యలు చేపడుతోంది. ప్రజలకు పారదర్శకంగా సమాచారం, సేవలు అందించేందుకు వీలుగా 'స్వర్ణ పంచాయతీ' వెబ్‌సైట్‌కు రూపకల్పన చేశారు. డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు సర్కారు సన్నద్ధమవుతోంది. దీని ద్వారా ఎక్కడ ఉన్నా పన్నులు సకాలంలో చెల్లించే వెసులుబాటు కల్పించనున్నారు. ఇందుకుగాను స్వర్ణ గ్రామ పంచాయతీ వెబ్‌సైట్ అందుబాటులో ఉంచారు. దీని ద్వారా ప్రజలకు సేవలు సులభతరం కానున్నాయి.

అక్రమాలకు అడ్డుకట్ట

పంచాయతీల్లో పన్నుల రూపంలో వచ్చిన ఆదాయానికి గండికొట్టకుండా డిజిటల్ విధానం ఉపయోగపడుతోంది. గతంలో పలు గ్రామాల్లో పన్నుల దుర్వినియోగం అయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. నిధుల దుర్వినియోగం కావడం, ఆలస్యంగా వెలుగు చూడడం.. వాటిపై ఫిర్యాదులు, దర్యాప్తులు, విచారణ పరిపాటిగా మారింది. వీటినన్నింటికి ఈ కొత్త విధానంతో అడ్డుకట్ట పడుతుందని అధికారులు చెబుతున్నారు.


వెబ్‌సైట్‌లో వివరాలను పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ రామాంజనేయులరెడ్డి, కార్యదర్శి తేజశ్విని

ఆదాయ వనరుల నమోదు

పంచాయతీల్లో ఎలాంటి లావాదేవీలు జరిగినా స్వర్ణ పంచాయతీ పేరిట ఆన్‌లైన్ చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి పైసా, ప్రతి పని ఇకపై పక్కాగా లెక్క తేలనుంది. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఆదేశాల మేరకు నివాస గృహాల పన్నులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అసెస్‌మెంట్లవారీగా ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తి చేసి డిజిటల్ రూపంలో సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటికే సుమారు 90 శాతం పైగా వివరాల నమోదు జరిగింది. ప్రొద్దుటూరు మండల పరిధిలోని 15 పంచాయతీల్లో ఉన్న 25 సచివాలయాలకు గాను 33,908 కుటుంబాలు ఉన్నాయి. స్వర్ణపంచాయతీ వెబ్‌సైట్‌లో మొదటగా పంచాయతీ ముఖచిత్రం లోడ్ చేస్తారు. ఇంటి విస్తీర్ణం, హద్దులు, యజమాని వివరాలు, ఏడాదికి ఎంత పన్ను చెల్లిస్తున్నారు, ఆస్తి, వ్యాపార సముదాయాలకు సంబంధించి పన్నులు, చెరువులు, స్థలాలు, లీజు, సెల్‌టవర్లు, పరిశ్రమలు, రోజువారి వ్యాపారాల నుంచి చేస్తున్న వసూళ్లు ఇలా.. పంచాయతీలకు ఆదాయం తెచ్చే వాటి వివరాలను నమోదు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లోజరుగుతున్న అక్రమాలకు ఈ స్వర్ణ పంచాయతీలతో ఇకపై చెక్ పడనుంది. పన్నుల రూపంలో పంచాయతీలకు వస్తున్న ఆదాయం పక్కదారి పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ఆన్‌లైన్ ద్వారా పొందే అవకాశం



స్వర్ణ పంచాయతీల పేరుతో ప్రభుత్వం పౌరసేవలను సులభతరం చేస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమకు అవసరమైనధ్రువీకరణ పత్రాలు, అనుమతులు ఆయా పంచాయతీల నుంచి ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు. ఇంటి పన్ను, ఇతర రుసుంలను అదే విధానంలో చెల్లించే వెసులుబాటు కలుగుతుంది. పంచాయతీల అభివృద్ధికి డిజిటల్ సేవలు ఎంతగానో ఉపయోగపడుతాయి.

- ఎస్.సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీవో, ప్రొద్దుటూరు.

దేశ వ్యాప్తంగా బీసీల సమగ్ర కుల గణన చేపట్టాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు


కలెక్టరేట్ ఎదుట చేపట్టిన మహా ధర్నాలో మాట్లాడుతున్న దుడం రెడ్డిబాబు

కడప మారుతీనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా సమగ్ర బీసీల కులగణన కార్యక్రమాన్ని చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దేశంలో కేవలం 5 శాతం వున్న అగ్రవర్ణాలకు కల్పించిన ఈడబ్ల్యుఎస్ 10 శాతం రిజర్వేషన్‌లను వెంటనే రద్దు పరచాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా చేపట్టారు. అంతకుముందు నగర మహావీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 75 సంవత్సరాలు అవుతున్నా నేటికీ బీసీ వర్గాల జనాభా తాలూకు సంఖ్యను తెలియపరచే సమగ్ర కుల గణన చేపట్టకపోవడం దారుణమన్నారు. మేమెంతో మాకంత వాటా ఇచ్చి తీరాలన్నారు. బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు కల్పించి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో తగిన ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న ఆంజనేయులు, అవ్వారు మల్లికార్జున, మదన్, మణికుమార్, వీరభాస్కర్, శివరామ్, రాష్ట్ర మహిళా నాయకురాలు ప్రశాంతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు రామలక్షుమ్మ పాల్గొన్నారు. అనంతరం జేసీని కలిసి వినతిపత్రం అందజేశారు.

జాతీయస్థాయి చెస్‌లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు


కప్ అందుకుంటున్న అష్రఫ్ సుభాని

కడప స్పోర్ట్స్, జనవరి 20, (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగిన జాతీయస్థాయి ఓపెన్ చెస్ ప్రైజ్ మనీ చెస్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన 23 మంది క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. ఇందులో ప్రధానంగా డి.అష్రఫ్ సుభాని ప్రథమ విజేతగా నిలిచి రూ.10 వేల నగదు బహుమతిని అందుకున్నారని జిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్ దర్బారి వెల్లడించారు. విభాగాల వారిగా అండర్-9 బాలికలలో లాస్యప్రియ తృతీయ విజేతగా, అండర్-11 బాలికల విభాగంలో దీపికా 2వ స్థానంలో, అండర్-15 బాలికల విభాగంలో తేజోమయి ద్వితీయ స్థానంలో, అండర్-7 బాయ్స్ విభాగంలో భార్గవ్ ద్వితీయ స్థానంలో, అండర్-13 బాలుర విభాగంలో అనురాగ్ నాల్గవ స్థానంలో.. ప్రేమ్‌దీప్ 5వ స్థానంలో రాణించడం చాలా గొప్ప విషయమన్నారు.

23న హాకీ జట్టుకు ఎంపికలు

కడప స్పోర్ట్స్, జనవరి 20, (ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు నగర రిమ్స్ సమీప స్పోర్ట్స్ స్కూల్ హాకీ మైదానంలో జిల్లా హాకీ జట్టుకు సంబంధించి బాలికల సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మహిళల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ సెక్రటరీ శేఖర్ తెలిపారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో 2009 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. అలాగే జూనియర్ బాలికల విభాగంలో 2006 జనవరి 1 తర్వాత జన్మించిన బాలికలు, సీనియర్ విభాగానికి వయోపరిమితి లేదన్నారు. ఎంపికలో పాల్గొనే సబ్ జూనియర్, జూనియర్, క్రీడకారిణులు తమ వెంట ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8688446515 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రవీంద్రనగర్‌లో చోరీ

- ఐదు తులాల బంగారు, రూ.2లక్షలు నగదు అపహరణ


బీరువాను ధ్వంసం చేసిన దృశ్యం

కడప క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం రవీంద్రనగర్‌లోని కిరణ్ బార్ సమీపంలోని ఓ ఇంటిలో దొంగలు పడ్డారు. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు, రూ.2లక్షలు నగదును అపహరించినట్లు బాధితురాలు షేక్ సత్తాజ్ తెలిపారు. ఆమె వివరాల మేరకు.. శనివారం పిల్లవాన్ని తీసుకుని మదనపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆమె భర్త కూడా ఇటీవల కువైట్‌కు వెళ్లారు. దీంతో ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బీరువాను ధ్వంసం చేసి బంగారు నగలు, డబ్బు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు తాలుకా పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. కాగా ఇంటి బయట, ఇంటిలో పల మొత్తం రక్తం మరకలు ఉన్నాయి. అయితే తమ బంధువులు ఎవరితో అయినా కలిసి చోరీ చేసినట్లుగా ఆమె అనుమానం వ్యక్తం చేస్తోంది.

తొమ్మిది మందిపై కేసులు

చాపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నవాడ గ్రామానికి చెందిన తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 19న ఆదివారం రాత్రి రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. గంగయ్య అనేవ్యక్తి తన పొలంలోని పైరుకు నీరు పెడుతుండగా పక్కనే ఉన్న పాపయ్య తోటలోకి ఆ నీరు పారి అతని వరిగడ్డి తడిసిపోయింది. ఈ విషయమై ఒకరిపై మరొకరు కట్టెలు, రాళ్లతో దాడి చేసుకోగా వారితలలకు, చేతులకు గాయాలయ్యాయి. ఈఘటనకు సంబంధించి గంగన్న, ప్రసాద్, గంగమ్మ, చిన్నగంగన్న, పామయ్య, సాయికుమార్, లక్ష్మీనారాయణ, మరో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్టు

కడప క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిలకలబావి వద్ద గత నవంబరు నెలలో జరిగిన ఘర్షణకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. చిలకలబావికి చెందిన అరాఫత్‌కు అదే ప్రాంతానికి చెందిన రియాజ్‌ల మధ్య మనస్పర్థలు ఉండేవి. నవంబరు 18న రాత్రి అరాఫత్‌పై రియాజ్ అతని అనుచరులు దాడి చేసి గాయపరిచారు. ఈ కేసులో కడపకు చెందిన ఏపీ ఖాదర్ వల్లిఖాన్, షేక్ మహ్మద్ బాబా అలియాస్ తాజ్, పఠాన్ హతహుల్లా అలియాస్ అతుల్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రి సీజ్

పోరుమామిళ్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని పోలీసుస్టేషను ఎదురుగా ఉన్న గంటా చిన్నపిల్లల హాస్పిటల్‌ను వైద్యాధికారులు సీజ్ చేశారు. ఆసుపత్రిలో కారు రామయ్య అనే వ్యక్తి ఇంజక్షన్ వికటించి మరణించిన విషయం తెలిసిందే. ఈవిషయమై సోమవారం ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లేశ్, డాక్టర్ జనార్ధన్ విచారణ నిమిత్తం ఆసుపత్రికి వచ్చారు. డాక్టరు అందుబాటులో లేకపోవడంతో ఆ ఇంటి యజమానితో పాటు ఎస్ఐ కొండారెడ్డితో చర్చించి హాస్పిటల్‌కు క్లోజ్డ్ స్టిక్కరు అంటించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత జిల్లా అధికా రులు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేస్తుండగా ప్రమాదం

- ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర అస్వస్థత
- సకాలంలో స్పందించిన పోలీసులు
- అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు



మృతి చెందిన నాగయ్య, చికిత్స పొందుతున్న చంద్రశేఖర్

కడప క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని రిమ్స్ పీఎస్ పరిధిలో రామాంజనేయపురం ఆచార్ల కాలనీలో సోమవారం ఉదయం సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు మజ్జారి నాగయ్య (44) అనే వ్యక్తి మృతి చెందగా... మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనపై స్థానికులు పోలీసు లకు సమాచారం అందించడంతో రిమ్స్ పీఎస్ సీఐ సీతారామిరెడ్డి, సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని.. అగ్నిమాపక శాఖ సిబ్బంది సహాయంతో సెప్టిక్ ట్యాంక్‌లో ఇరుక్కుపోయిన వ్యక్తులను బయటికి తీసి రిమ్స్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..

కడప రామాంజనేయపురం ఆచార్లకాలనీకి చెందిన బిక్కిలి అరుణ్‌కుమార్ (39) తన ఇంటి ముందు సెప్టిక్ గుంతను సెప్టిక్ ట్యాంకరు ద్వారా శుభ్రం చేయించారు. ఆ తర్వాత మరింత మురికి బయటకు వచ్చేందుకు యాసిడ్‌ను అందులో వేశారు. మరికొంత సమయానికి నాగయ్య అనే వ్యక్తి సెప్టిక్ ట్యాంకును శుభ్రం చేసేందుకు లోపలికి దిగి ఊపిరి ఆడక పడిపోయాడు. నాగయ్యను కాపాడే ప్రయత్నంలో అరుణ్‌కుమార్ లోపలికి దిగి తాను అవస్థతకు గురయ్యాడు. దీంతో స్థానికుల కేకలు వేయడంతో మజ్జారి చంద్రశేఖర్ (26) అనే మరో వ్యక్తి వారిద్దరినీ కాపాడే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఒకరి తరువాత మరొకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన సీఐ సీతారామిరెడ్డి, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సెప్టిక్ ట్యాంక్‌లోని వారిని కాపాడే ప్రయత్నంలో సీఐ కూడా కొంత అస్వస్థతకు గురయ్యారు. ఈ లోపు అగ్నిమాపకశాఖ వారికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని.. ప్రమాదంలో చిక్కుకున్న నాగయ్యను తాళ్లతో బయటికి లాగి 108లో రిమ్స్‌కు తరలించగా... కొంతసేపటికి మృతి చెందాడు. అరుణ్‌కుమార్, చంద్రశేఖర్‌లు చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. కాగా మృతుడు నాగయ్య బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య లక్ష్మీదేవి, చంద్రిక, చరణ్, చంద్ర అనే ముగ్గురు సంతానం.


రిమ్స్‌లో రోదిస్తున్న మృతుని బంధువులు

హత్యాయత్నం కేసులో 12 మందికి మూడేళ్ల జైలు శిక్ష

వీరపునాయునిపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): 2014లో జరిగిన హత్యాయత్నం కేసులో 12 మందికి మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని ఎరమలపల్లె గ్రామంలో బొమ్మరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, అతని భార్య అరుణలకు 2005లో వివాహమైంది. ఇద్దరు పిల్లలు అనంతరం భార్య భర్తల మధ్య మనస్పర్థల కారణంగా పెద్దమనుషులు పంచాయతీ మేరకు ఎవరికి వారు విడివిడిగా కాపు ఉండేవారు. ఈ క్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి తన భార్య, పిల్లల జీవనోపాధి నిమిత్తం రూ.12లక్షలు ఎల్ఐసీ బాండ్లు, డబ్బు మరియు నాలుగు సెంట్ల స్థలం ఇచ్చాడు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి గ్రూప్-2 పరీక్షలో సెలెక్ట్ అయి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం వచ్చింది. అనంతరం అతని భార్య, మరికొందరు కలిసి ఇంకా తమకు ఎక్కువ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ చేసుకుందామని పిలిపించి చంద్రశేఖర్‌రెడ్డిపై, అతని బంధువైన రామకృష్ణారెడ్డి అనే అతనిపై రాడ్లు, కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎస్కే రోషన్ కేసు నమోదు చేశారు. ఈ కేసు ప్రొద్దుటూరు అసిస్టెంట్ సెషన్ జడ్జి కోర్టులో విచారణకు రాగా ప్రస్తుత ఎస్ఐ మంజునాథ్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చగా.. 12 మందికి మూడేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ఇష్టంలేని పెళ్లి చేశారని... యువతి ఆత్మహత్య


లక్ష్మికళ (ఫైల్ ఫొటో)

మైలవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తనకు ఇష్టంలేని పెళ్లి చేశారని జీవితంపై విరక్తి చెంది గోరంట్ల లక్ష్మికళ (20) అనే వివాహిత మైలవరం జలాశయంలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్యాం సుందర్‌రెడ్డి వివరాల మేరకు... దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన లక్ష్మికళను గూడెం చెరువుకు చెందిన రామాంజనేయులుకు ఇచ్చి అయిదు నెలల క్రితం వివాహం చేశారు. సంక్రాంతి పండుగకు పట్టిళ్లు అయిన దొమ్మరనంద్యాల గ్రామానికి వచ్చి తల్లివద్ద ఉండేది. 18వ తేదీ దొమ్మరనంద్యాలలోని ఇంటి నుంచి తల్లికి చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో లక్ష్మికళ తల్లి తన కూతురు కనిపించడంలేదని మైలవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం మైలవరం జలాశయంలో మహిళా మృతదేహం లభ్యం కావడంతో జాలర్ల సాయంతో బయటకు తీసి.. లక్ష్మికళ అని నిర్ధారించుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విషద్రావణం తాగి మహిళ మృతి

సింహాద్రిపురం, జనవరి 20 (ఆంధ్రజ్యో తి): మండలంలోని అగ్రహారం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన ప్రభావతి (55) కడుపునొప్పి తాళలేక విషద్రావణం తాగి నట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఆమె గత నెల రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ నెల 17వ తేదీ చీనీ చెట్లకు పిచికారి చేయడానికి తెచ్చిన పురుగుల మందు తాగింది. దీంతో అపస్మారక స్థితిలో వున్న ప్రభావతిని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది.

జిల్లా విద్యాశాఖాధికారిగా షంషుద్దీన్



కడప ఎడ్యుకేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా తాండ్రపాడు డైట్ సీనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.షంషుద్దీన్‌ను కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోనశశిధర్ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న యు.మీనాక్షిని రిలీవ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు షంషుద్దీన్ కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా కొనసాగుతారని సూచించారు. మీనాక్షి యదావిధిగా ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖాధికారిగా కొనసాగుతారు. అయితే మీనాక్షి డీఈఓగా మాకొద్దు అంటూ ఉపాధ్యాయ సంఘాలు ఈ మధ్యకాలంలో ధర్నాలు చేయడం జరిగింది.

మా భూములు మాకు దక్కేలా చూడండి

- తహసీల్దారు వద్ద మాలల మొర


తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న మాలలు

ముద్దనూరు జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వంశపారపర్యంగా వస్తున్న మాలల మాన్యం భూములను చిన్న దుద్యాల గ్రామం వైసీపీకి చెందిన భూమిరెడ్డి గంగమ్మ పేరుతో కుటుంబ సభ్యులు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పెద్ద దుద్యాల గ్రామానికి చెందిన మాలలు వరదమ్మ మరి కొందరు సోమవారం తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ తమ సొంత గ్రామం పెద్దదుద్యాల గ్రామం అయినా చిన్నదుద్యాల గ్రామానికి కూడా తమ పూర్వీకులు కాటికాపరి పనులు చేస్తుండేవారన్నారు. తమ పూర్వీకులకు 1910 సంవత్సరంలో చిన్న దుద్యాల గ్రామంలో సర్వే నెంబర్100లో దాదాపు 10.50 ఎకరాల భూమి అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం మాలలకు మాన్యం ఇచ్చిందన్నారు. 1956 నుంచి ఆర్‌హెచ్, ఆర్ఎస్ఆర్‌లో కూడా నమోదయ్యిందన్నారు. అప్పటి నుంచి ఎవరి పేరు మీద ఎటువంటి మార్పు చెందలేదన్నారు. 2007 సంవత్సరంలో చిన్నదుద్యాల గ్రామానికి చెందిన భూమిరెడ్డి నాగశివారెడ్డి అనే వ్యక్తి పక్కా పథకం ప్రకారం తమ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. మొదట పోలు లక్ష్మీనారాయణమ్మ పేరుతో అక్రమ పట్టాదారు పాస్‌బుక్ పుట్టించారు. తరువాత అదే సంవత్సరం తన తల్లి భూమిరెడ్డి గంగమ్మపేరుపై రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆమె మరణాంతరంభూమిరెడ్డి నాగశివారెడ్డి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. తరువాత 2022లో తన కొడుకు నాగార్జునరెడ్డికి రిజిష్టర్ చేయించారని ఆరోపించారు. తమ మాన్యం భూమి తమకు దక్కేలు చర్యలు తీసుకోవాలని తహసీల్దారుకు బాధితులు విన్నవించుకున్నారు. దీనిపై తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాలలు బాబు, రాజు, మేరి, వాసు, సుధ, రమేష్‌లు పాల్గొన్నారు.

రేపు గండికోట నిర్వాసితుల గుర్తింపు ఆధార పత్రాల పరిశీలన

జమ్మలమడుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ కార్యాలయ సభాభవనంలో ఈనెల 22వ తేదీ గండికోట నిర్వాసితుల గుర్తింపు ఆధార పత్రాల పరిశీలన ఉంటుందని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. గండికోట జలాశయం కింద కొండాపురం మండలంలో ముంపు గ్రామంగా ప్రకటించిన పి.అనంతపురం గ్రామ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ గెజిట్‌లో పేర్లు నమోదుకు బియ్యం కార్డు, ఆధార్‌కార్డు, జాబితా బ్యాంకు పాసుపుస్తకం, విద్యార్హత, ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోవాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు, ఇతరత్రా పత్రాలతో ఎవరైతే గతంలో హాజరు కాలేదో అలాంటి వారు రావాలన్నారు. నిర్వాసితులు తప్పుడు గుర్తింపు ఆధార పత్రాలను సమర్పిస్తే చర్యలు తప్పవన్నారు.

దేవర చేయాలంటే చందాలెత్తాల్సిందే..

● మాన్యాలున్నా.. ధూపం దీపం కరువు ● ఆక్రమణలో 42 ఎకరాల భూములు ● దుస్థితిలో దేవరెద్దు ఆలయం



వడ్డెపల్లెలోని దేవర ఎద్దు ఆలయం

లక్కిరెడ్డిపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పెద్ద ఎత్తున మాన్యాలున్నా ఏడాదికోసారి నిర్వహించే దేవరకు అడుక్కోవాల్సి వస్తోందని దేవర ఎద్దు ఆలయ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ జింకలగుట్ట వడ్డెపల్లెలో ఉన్న దేవరెద్దు ఆలయానికి 42 ఎకరాల మాన్యం ఉంది. ఈ భూముల ద్వారా వచ్చే ఆదాయంలో ఆలయంలో ధూపదీప నైవేద్యాలు నిర్వహించాల్సి ఉంది. అయితే, ఆ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయో ఇప్పటికీ తెలియదు. ఇంత వరకూ ఎవరూ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని కమిటీ సభ్యులు చెబుతున్నారు. గతంలో ఎకరాకు వెయ్యి రూపాయలు చెల్లించాలని కమిటీ తీర్మానం చేయగా, అప్పట్లో కొంత మంది మాత్రం దేవరకు, వేల్పుకు ఖర్చు పెట్టేవారని, 20 సంవత్సరాల నుంచి భూములు ఆక్రమించుకున్న వారు ఎవరూ ఇంత వరకు ఒక్క రూపాయి కూడా ఆలయానికి ఇవ్వలేదని చెబుతున్నారు. పందిళ్లపల్లె, తాటిమాకులపల్లె గ్రామాల్లో ఉన్న ఈ పొలాల గట్లపై ఉన్న పెద్దపెద్ద వేపచెట్లు కూడా అమ్ముకున్నారని కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, రాజకీయ నాయకులు అడ్డుపడుతుండడం కారణంగా వారు చర్యలు తీసుకోలేకపోతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. దేవరెద్దు మాన్యం భూముల సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళుతున్న తమపై ఆక్రమణదారులు గొడవకు దిగుతున్నారని కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి దేవర ఎద్దు మాన్యం భూములకు సంబంధించిన వివరాలతోపాటు, అవి ఎవరెవరి ఆధీనంలో ఉన్నాయో తేల్చాలని, ఆక్రమించుకున్న వారందరికీ నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దాతల సహకారంతోనే దేవర



మాన్యం భూములు ఆక్రమించుకున్నవారు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడంతో దేవర నిర్వహించేందుకు చందాలు వసూలు చేయాల్సి వస్తోంది. ధూపదీప నైవేద్యాలకు సైతం దాతలపై ఆధారపడుతున్నాం. మాన్యం భూములు ఎవరెవరి ఆధీనంలో ఉన్నాయో తేల్చాలి. ఆ భూముల నుంచి వచ్చే ఆదాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం.

\- వెంకటరమణ, కమిటీ సభ్యుడు

సర్వేతో కుష్టు బాధితుల గుర్తింపు: డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

సంబేపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సర్వే నిర్వహించి కుష్టు వ్యాధి బాధితులను గుర్తిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య తెలిపారు. సోమవారం మండలంలోని దేవపట్ల పీహెచ్‌సీలో ఇంటింటికి కుష్టువ్యాధి సర్వే కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు సిబ్బంది ఒక్క బృందంగా ఇంటింటికి వెళ్లి వ్యాధి లక్షణాలున్న రోగులను గుర్తించి పీహెచ్‌సీకి పంపాలన్నారు. అక్కడ పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే తీవ్రతను బట్టి ఉచితంగా చికిత్స చేస్తారని తెలిపారు. ఈ రోజు నుంచి రెండు వారాల పాటు కార్యకర్తలు ఇంటింటా సర్వే చేసి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ, జిల్లా న్యూక్లిస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తొలిదశలోనే వ్యాధిని గుర్తించి, తొందరగా చికిత్స ఇవ్వడమే ఈ సర్వే లక్ష్యమన్నారు. సర్వే చేసే విధానం, ఫార్మాట్స్‌ను వివరించారు. పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ చిరంజీవిరెడ్డి, డాక్టర్ రాధామాధవి, పీఎంవో రవి కుమార్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం: ఏఎస్పీ



మీడియాతో మాట్లాడుతున్న ఏఎస్పీ మనోజ్ రాంనాథ్ హెగ్డే

రైల్వేకోడూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని రాజం పేట ఏఎస్పీ మనోజ్‌రాంనాథ్‌హెగ్డే తెలిపారు. సోమ వారం ఆయన రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కోడిపందేలు, మట్కా, వైట్ కాలర్ నేరాలు, ఎర్ర చందనం అక్రమ రవాణా, వ్యభిచారం తదితర అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గంజాయిపై ప్రత్యే కంగా నిఘా ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల నివా రణ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. రైల్వేకోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, పెనగలూరు, పుల్లంపేట, రాజంపేట తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలిం చారు. సిబ్బంది లోటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు పోతామని తెలిపారు. తన పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్లను ముందుగా పరిశీలించి ఎక్కడెక్కడ ఏఏ సమస్యలున్నాయన్న అంశంపూ పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రతి బాధితుడికి పోలీసులు భరోసా కల్పిస్తారని తెలిపారు. న్యాయం వైపే ఉండి సమస్యలను పరిష్కారం చేస్తారని తెలిపారు. పోలీసులు సమయపాలన పాటించాలన్నారు. రికార్డులు సక్రమంగా ఉంచాలని రైల్వేకోడూరు టౌన్ సీఐ కే. హేమసుందరరావు, రూరల్ సీఐ పీ. వెంకటేశ్వర్లు, రైల్వేకోడూరు ఎస్‌ఐ నవీన్‌బాబుకు సూచించారు. కేసుల పురోగతిపై తరచూ సమీక్షలు చేస్తుంటామని తెలిపారు. అనంతరం పలు విషయాలపై స్థానిక పోలీసు అధికారులతో చర్చించారు.

పశు ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



పశువులకు వైద్యం చేస్తున్న ఏడీఏహెచ్ విజయ్‌కుమార్, సిబ్బంది

సుండుపల్లె, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం సుండుపల్లె-2 పరిధిలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈడిగపల్లె, రాచంవాండ్లపల్లె గ్రామాల్లోని 46 పశువులకు ప్రథమ చికిత్స చేయడంతోపాటు, 1085 గొర్రెలు, మేకలకు, 42 పశువులు, 52 దూడలకు నట్టల నివారణ మందులు అందజేశామన్నారు. 452 గొర్రెలకు పారుడు వ్యాధి వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. 14 పశువుల్లో గర్భకోశ పరీక్షలు, 12 పశువులకు చూలు పరీక్ష నిర్వహించి రైతులకు సూచనలు, సలహాలు అందజేశామన్నారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయతీలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, డాక్టర్ బీ. వెంకటేశ్వర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, గోపాలమిత్ర సిబ్బంది పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ దూదేకులపల్లె, మంగళపల్లె గ్రామాల్లో సోమవారం డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1526 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేశామని, 25 దూడలు, 57 ఆవులు, బర్రెలకు వైద్యం చేశామని తెలిపారు. పశు యాజమానులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం: మండల కేంద్రంలోని బలిజపల్లె, కలిబండలో నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్‌పిళ్లై పరిశీలించారు. ఈ నెల 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తారని తెలిపారు. రైతులు 500 రూపాయలు చెల్లించి సూదులను వేయిస్తే 90 శాతం పెయ్య దూడలు జన్మిస్తాయని రైతులకు వివరించారు. ఈ పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు సఖి కేంద్రం సహకారం



రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిని సన్మానిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సఖి కేంద్రం సిబ్బంది

రాయచోటిటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇబ్బం దుల్లో ఉన్న మహిళలకు సఖి కేంద్రం తగిన సహ కారం అందిస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ స భ్యురాలు రుఖియాబేగం అన్నారు. పట్టణంలోని సఖి కేంద్రాన్ని ఆమె సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు అన్యాయం, అవమానం జరిగితే వెంటనే 181, బాల్య వివాహాల నివారణ కోసం 1098 అనే టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. బాలికల విద్యతోనే సమాజంలో ఉన్న దురాచారాలు, బాల్యవివాహాలు దూరమవుతాయన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతా ల్లో 12 ఏళ్లకే బాలికలకు వివాహం చేస్తున్నారని, ఇలాంటి దురాచారాలను అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సఖి కేంద్రానికి వచ్చే బాధితులకు సఖి కేంద్రంలోని అధికారులు, సిబ్బంది పూర్తి సహాయ సహకారం అందించి అండగా నిలవాలని ఆదేశించారు. అనంతరం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖియాబేగంను ఐసీడీఎస్ పీడీ రమాదేవి, ఐసీడీఎస్ సిబ్బంది, సఖి కేంద్రం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, సఖి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామకంఠం ఆక్రమణపై ఫిర్యాదు

పుల్లంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కోనయ్యగారిపలెలో 40 సెంట్ల గ్రామ కంఠం ఆక్రమణకు గురైందని కుమారునిపల్లె గ్రామస్థులు సోమవారం తహసీల్దారు అరవింద్ కిషోర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు.

'బిల్లులివ్వకుండా వేధిస్తున్నారు'

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 20(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో క్వారంటైన్‌లో ఉన్న వారికి భోజనాలు అందించినందుకు సంబంధించిన బిల్లులు ఇంత వరకు ఇవ్వలేదని మొలకలచెరువు మండలానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కరోనా సోకిన రోగులకు, వైద్య సిబ్బందికి దాదాపు రెండు నెలల పాటు భోజనం సరఫరా చేసినందుకు దాదాపు రూ.7 లక్షల పైగా ఖర్చు అయ్యిందని, ఇందుకు సంబంధించిన బిల్లులపై అప్పటి తహసీల్దార్ సంతకాలు కూడా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పటి నుంచి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా తహసీల్దార్ కార్యాలయం వారు తిప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి డబ్బులుఇప్పించాలని కోరుకున్నాడు.

'పాఠశాల వంటగది తాళాలు ఇప్పించండి'

సిద్దవటం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : వంటగది తాళాలు ఇప్పించాలని విద్యాకమిటీ చైర్మన్ హరికృష్ణ సోమవారం ఇన్‌చార్జి తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని 11 పోలీసు బెటాలియన్ జిల్లా పరిషత్ హైస్కూల్లో జనవరి ఆరో తేదీ నుంచి కొత్త వంట ఏజెన్సీకి మధ్యాహ్న భోజనం బాధ్యతలు అప్పగించారు. అయితే పాత వంట ఏజెన్సీ వారు వంట గది తాళాలు ఇంతవరకు అప్పగించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, తహసీల్దారుకు విన్నవించినట్లు ఆయన తెలిపారు. పుత్తా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో ఘనంగా పల్లకి ఉత్సవం



పల్లకిపై ఊరేగుతున్న భద్రకాళి, వీరభద్రస్వామి

రాయచోటిటౌన్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకి ఉత్సవం నిర్వహించారు. వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలనుపుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. ఈవో టీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు

రీ సర్వేకు సహకరించాలి

రామాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేకు గ్రామ ప్రజలు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ కృపావతి కోరారు. సోమవారం నల్లగుట్టపల్లె రెవెన్యూ గ్రామంలో రీ సర్వే ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. రైతులు తమ భూముల హద్దులు చూపించి సర్వేకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అయోధ్యాపురం నాగభూషణ్‌రెడ్డి, టీడీపీ నాయకులు చిలేకాంపల్లి శివారెడ్డి, వీఆర్‌వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

భూములు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మదనపల్లె వాసులు

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం పనస మాకుల పల్లెలోని దళితులకు వ్యవసాయ భూమి, ఇంటి స్థలాలు, శ్మశానానికి స్థలం కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మంచాల హరికుమార్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మంచాల హరికుమార్ మాటా్లడుతూ దళితులు పశువులను తమ భూమిలోనికి వెళ్లకుండా అగ్రవర్ణాల వారు అడ్డుకుంటున్నారని తెలిపారు. దళితులు బజారులో స్వేచ్ఛగా తిరి గేందుకు కులం అడ్డు వస్తోందన్నారు. దళితవాడకు సరైన శ్మశాన వాటిక సైతం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో పనసమాకులపల్లె దళితు లు రమణ, నాగ రాజు, సుబ్రమణ్యం, నరసింహులు, రెడ్డెమ్మ, శ్రీరాములు, తిప్పమ్మ, కృష్ణప్ప, అక్కులమ్మ, మునెమ్మ, వసంత తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్ మహబూబ్ చాంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్

రైల్వేకోడూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్‌కు విన తిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో దళితులు, గిరిజనులు, మైనార్టీలు, బీసీలు తదితరులు అద్దెలు చెల్లించ లేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. చాలీచాలని కూలీలతో ఒక పూట కడుపునిండా భోజనం చేయలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే వారికి ఇంటి స్థలాలు కేటాయించి, ఇండ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఒక్కో గిరిజనుడికి రెండు ఎకరాల భూమి ఇస్తే వారి జీవన స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాలు పంపిన వెంటనే చర్యలు తీసుకుంటామని, భూముల కు అసైన్‌మెంట్ కమిటీ సమావేశం జరగాలని, భూముల వివరాలు సక్రమంగా ఉంటే ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు.

ఫుట్‌పాత్‌పై వాహనాలు నిలిపితే చర్యలు

రాయచోటి టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య అధికమవుతున్న నేపథ్యంలో సోమవారం ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీ, స్టేట్‌బ్యాంక్, మోర్ సూపర్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై అడ్డంగా నిలిపిన వాహనాలను తొలగించారు. అనంతరం మాట్లాడుతూ నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలను నిలిపినా, రాంగ్ డైరెక్షన్‌లో వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసర మైతే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'నిబంధనలు పాటించకుంటే జరిమానా తప్పదు'

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 20(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత నియమాలు పాటించకుంటే భారీ జరిమానా తప్పదని రైల్వేకోడూరు ఎస్‌ఐ నవీన్ బాబు హెచ్చరించారు. రోడ్డు వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని చిట్వేల్ రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహిం చారు. మైనర్లకు వాహనాలు ఇస్తే రూ.25 వేలు జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని తెలిపారు.

'పెట్టుబడిదారుల కోసమే విజన్ 2047'

రాయచోటిటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చెబుతున్న విజన్ 2047 కేవలం కార్పొరేట్ల కోసమేనని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ చంద్రశేఖర్, అబ్బ వరం రామాంజులు ఆరోపించారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లె సర్వజన ఆసుపత్రిలో వైద్యాన్ని పేదలకు దూరం చేయడం మొదలుకొని హార్సిలీహిల్స్ నిర్వహణ కూడా ప్రైవేటు వారి చేతిలో పెట్టడం, కోడూరు రైతుల భూముల కార్పొరేట్ సంస్థలకు అప్పగించేం దుకు కూటమి ప్రభుత్వం సిద్ధం అవుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభు త్వ సంస్థల ప్రైవేటీకరణను మానుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

రాయచోటిటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాయచోటి పట్టణంలోని బీహెచ్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో రాయచోటి తాలూకా ఉద్యోగుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలూకాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

గాలివీడు, జనవరి20(ఆంధ్రజ్యోతి): అతెనా సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ వారి ఆధ్వర్యంలో సోమవారం తూముకుంట, ఎగువమూల గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలకు విద్యాధికారులు పిల్లి నాగరాజు, శ్రీనివాసులు క్రీడాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈక్రీడా సామాగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో రాజకీయం

వీరబల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వంగిమళ్ల పంచాయతీలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లను నిబంధనలకు విరుద్ధంగా తొలగించి వారి స్థానంలో కొత్తవారి నియామకానికి ఎంపీడీవో నూర్జహాన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నారంటూ టీడీపీలోని ఓ వర్గం నాయకులు ఆరోపించారు ఆమె అవినీతి అక్రమాలను కలెక్టర్ స్థాయికి తీసుకెళతామని హెచ్చరించారు. కాగా, అధికారులపై ఇష్టానుసారం వ్యవహరించడం తగదని టీడీపీ నేత కల్లూరి ప్రతాప్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమార్జనకు పాల్పడడంతోనే వంగిమళ్ల ఫీల్డ్ అసిస్టెంటుగా పనిచేస్తున్న శరత్‌రెడ్డిని తొలగించినట్లు తెలిపారు. ఎంపీడీవో నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించారని తెలిపారు.

దివ్యాంగుల సమస్యలపై సబ్‌కలెక్టర్ ఆరా

రాజంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సమస్యలు విన్నవించడానికి వచ్చిన దివ్యాంగుల వద్దకు సబ్‌కలెక్టర్ నిధియాదేవి స్వయంగా వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 9 మండలాల ప్రజలు భూ సమస్యలపై సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

మద్యం తాగి వాహనం నడిపినందుకు 14 రోజులు జైలు

రాజంపేట టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : డంకన్ డ్రైవ్ కేసులో నిందితుడికి 14 రోజుల జైలు శిక్ష విధిస్తూ రాజంపేట సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. పుల్లంపేట మండలం వత్తలూరు ఈడిగపల్లె కు చెందిన పోలా సుబ్బరాయుడు మద్యం సేవించి బైక నడుపుతూ పట్టుబడడంతో కేసు నమోదు చేసి సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఈ శిక్ష విధించినట్లు మన్నూరు సీఐ ఎస్ఎం అలీ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి


మృతిచెందిన యువకుడు

పెద్దమండ్యం, జనవరి 20(ఆంధ్రజ్యోతి) అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన పెద్దమండ్యం మండలం కలిచెర్లలో సోమవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కలిచెర్ల గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌షరీఫ్ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి తోడుగా ఉంటున్న ఆయన కుమారుడు ఉస్మాన్ (20) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కలిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక సమీపంలో ఉన్న చింతచెట్టు కింద సోమవారం అనుమానాస్పద స్థితిలో శవమై పడివున్నట్లు గ్రామస్థులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు పెద్దమండ్యం పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలంలో వున్న ఉస్మాన్ మృతదేహాన్ని పరిశీలించారు. ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి మృతి చెంది ఉంటాడని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శవ పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రమణ తెలిపారు. మృతుడి తండ్రి ఖాదర్‌షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉదయగిరిలో రాజంపేట వాసి మృతి


మృతిచెందిన శంకరయ్య

ఉదయగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఉదయగిరి పట్టణంలో సోమవారం రాజంపేటకు చెందిన శంకరయ్య మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. శంకరయ్య రెండేళ్లుగా ఉదయగిరిలో ప్లాస్టిక్ సామగ్రి, చిత్తు కాగితాలు పోగు చేసి విక్రయించి జీవిస్తున్నాడు. స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న పాత సామాన్లు కొనుగోలు చేసే దుకాణం వద్దే నివసిస్తున్నాడు. అక్కడే సోమవారం మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. శంకరయ్య రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, అతనికి మద్యం అలవాటు కూడా ఉందని స్థానికులు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సిద్దవటం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం సమీపాన నేషనల్ హైవేపై జనవరి 15న రాత్రి గుర్తు తెలియని వ్యక్తిని(50) ఓ వాహనం ఢీకొనడంతో అతనికి బలమైన గాయాలయ్యాయి. దీంతో స్థానికులు, హైవే పెట్రోలింగ్ పోలీసులు 108 వాహనంలో మెరుగైన వైద్యం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా చికిత్స తీసుకుంటూ సోమవారం ఉదయం మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించడంతో మార్చురీకి తరలించామని స్థానిక పోలీసులు తెలిపారు. ఎవరైనా మృతిచెందిన వ్యక్తిని బంధువులు గుర్తుపడితే వెంటనే రావాలని పోలీసులు తెలియజేశారు.

కోడిపందేల నిర్వహణపై ఎస్‌బీ పోలీసుల విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కురబలకోట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడు సమీపంలో జోరుగా కోడిపందేలను బహిరంగంగా ఆదివారం నిర్వహించడంపై ఎస్‌బీ పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం 'జోరుగా కోడి పందేలు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఎస్‌బీ అధికారులను ఆదేశించడంతో ఆ మేరకు విచారణ చేపట్టారు. దీంతో ముదివేడు చుట్టుపక్కల విచారించి నివేదికను ఎస్పీకి అందజేశారు.

శిబ్యాల పంచాయతీ కార్యదర్శి బదిలీ

కలికిరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండలంలోని శిబ్యాల గ్రామ పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శి కాశెట్టి నాగరాజ రాజు గుంటూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులిచ్చింది. తగు చర్యలు తీసుకొనేందుకు పంచాయతీ రాజ్ కమిషనర్‌ను ప్రభుత్వం అనుమతించింది. బదిలీలపై ప్రస్తుతం అమల్లో నిషేధాన్ని సడలిస్తూ మానవతా దృక్పథంతో చేసిన ఈ బదిలీకి సంబంధించిన ఉత్తర్వును పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ జీవో జారీ చేశారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపికలు

కడప స్పోర్ట్స్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజీవ్‌మార్గ్ రోడ్డులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 బుధవారం ఉదయం సీనియర్స్ మహిళల..పురుషుల కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, జనార్ధన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి వుంటుందన్నారు.

వాహనాల స్కామ్..!


బైపాస్ రోడ్డులో అమ్మకానికి సిద్ధం చేసిన వాహనాలు

రోజురోజుకు వాహనాల స్కామ్ ఎక్కువవుతోంది. మదనపల్లెకు చెందిన కొందరు ఓ ముఠాగా ఏర్పడి ఈ తతంగం నడిపిస్తున్నట్లు సమాచారం. సెల్ఫ్ డ్రైవింగ్ పేరుతో కార్లను అద్దెకు తీసుకొని.. ఆపై ఉడాయిస్తున్నారు. ఆ వాహనాలను తాకట్టు పెట్టి సొమ్ము చేసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. మదనపల్లె కేంద్రంగా ఇదంతా జరుగుతున్నట్లు తెలుస్తోంది. వాహన యజమాని బాడుగ వస్తే చాలని ఎవరికి పడితే వారికి అద్దెకు ఇవ్వడంతో ఈ మోసాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు. చివరకు బాధితులు చేసేది లేక పోలీసులను ఆశ్రయిస్తూ లబోదిబోమంటున్నారు.

- సెల్ఫ్ డ్రైవింగ్ పేరుతో అద్దెకు..
- మదనపల్లె కేంద్రంగా రవాణా
- కడప జిల్లాలో తాకట్టు..
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- సిండికేట్‌గా.. నమ్మించి మోసం..

మదనపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇదో కొత్త రకమైన వాహనాల స్కామ్. మదనపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి వాహన యజమానులు, వాహనాల పార్కింగ్ కేంద్రాలు, ట్రావెల్స్ నుంచి కారు, సుమో, ఇన్నోవా, స్కార్పియో, తదితర రకాల వాహనాలను రోజువారీ, నెలవారీ అద్దెకు తీసుకుంటున్నారు. సెల్ఫ్ డ్రైవింగ్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ఇంజనీరింగ్ పనుల వద్ద సైట్లలో, తదితర రకాల పేరుతో అద్దెకు తీసుకుంటారు. మొదట్లో రెండు, మూడు రోజులు అద్దె చెల్లిస్తారు. ఇంకా అవసరమైతే.. టూర్, ఇతర అవసరాల పేరుతో వారం, పదిహేను రోజులు పొడిగిస్తారు. అనంతరం అవసరాన్ని బట్టి బయటి ప్రాంతంలో ఒక్కో వాహనాన్ని రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు తాకట్టు పెట్టి రుణం తీసుకుంటున్నారు. రుణదాతలకు వడ్డీ చెల్లిస్తూ, వీటిని ష్యూరిటీగా పెడుతున్నారు. పని కాగానే, అప్పు చెల్లించి వాహనాన్ని రిలీజ్ చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. అయితే తాము అనుకున్న పని కానప్పుడు సీన్ రివర్స్ అవుతోంది. దీంతో యజమానికి సమాధానం చెప్పలేక చివరకు కటకటాల పాలవుతున్నారు. ఆ లోగా వాహనం జాడ యజమానికి తెలిస్తే, బంధువులు లేక అయిన వారో తీసుకెళ్లారని బుకాయిస్తారు. అప్పటికీ వాహనం ఇంటికి రాకుంటే పోలీసులను ఆశ్రయించి, వాహనం చోరీ అయిందనో లేక అద్దె పేరుతో తీసుకెళ్లి పరారయ్యాడని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు.

మదనపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు మదనపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, పీలేరు ఏరియాలలో రోజువారీ అద్దెకు, నెలవారీ బాడుగ పేరుతో తీసుకెళ్లి కడప జిల్లా చక్రాయపేట, గండి, వేంపల్లె, ప్రొద్దుటూరు, పులివెందుల, తదితర ప్రాంతాల్లో తాకట్టు పెడుతున్నారు. మదనపల్లె కేంద్రంగా కొన్నేళ్లుగా కొనసాగుతున్న దందాలో ఎక్కడో ఇటీవల బెడిసికొట్టడంతో వెలుగులోకి వచ్చింది. అలాగే హైదరాబాద్ కేంద్రంగా కూడా అక్కడి ఏజెంట్లు మదనపల్లెకు తెచ్చి ఇలాంటి అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు ఇటీవల బయట పడింది. కేసులు, పోలీసుల వరకూ వెళ్లినవి కొన్నే అయితే, వెలుగులోకి రానివి మరెన్నో ఉన్నట్లు వాహన, ట్రాన్స్‌పోర్టు యజమానులు చెబుతున్నారు.


మదనపల్లెలోని ఓ పార్కింగ్ కేంద్రంలోని వాహనాలు

మదనపల్లెకు చెందిన ముగ్గురు వాహన యజమానులు వారం రోజుల క్రితం తమ వాహనాలు కనిపించలేదని తాలూకా పోలీసులను ఆశ్రయించారు. చివరకు వాహనాల జాడ తెలుసుకున్న బాధితులు.. పోలీసులతో కలిసి 20 మంది యువకులు రెండు వాహనాల్లో కడప జిల్లా చక్రాయపేటకు వెళ్లారు. అక్కడ వారి వాహనాలు కలిగి ఉన్న వ్యక్తులను ప్రశ్నిస్తే మదనపల్లెకు చెందిన ఓ వ్యక్తి తమకు తాకట్టు పెట్టాడని తెలిపారు. ఆ వాహనాలు తమవని మీరెలా తాకట్టు పెట్టుకుంటారని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన వాహన రికార్డులను వాహన యజమానులు చూపిస్తే, తాకట్టు పెట్టుకున్నట్లు మధ్యవర్తి ద్వారా రాయించుకున్న రికార్డులు వారూ చూపించారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారితీసింది. ఈ విషయం చక్రాయపేట మండలంలో దావానంలా వ్యాపించింది. ఈ క్రమంలో ఇలాంటి అద్దె వాహనాలను తాకట్టు పెట్టుకున్న వారంతా ఏకమయ్యారు. చివరికి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఈ పంచాయితీ కాస్త అక్కడి చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌కు చేరింది. మీకు వాహనాలు ఇచ్చేది లేదని, మీరు ఎవరికి అద్దెకు ఇచ్చారో వారిని తీసుకురావాలని పట్టుబట్టారు. మీకు బండ్లు ఇస్తే.. మేం ఇచ్చిన డబ్బులు ఎవరిస్తారని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితిల్లోనూ వాహనాలు ఇవ్వమని తెగేసి చెప్పారు. చివరకు వాహనాలు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో పెట్టడంతో మదనపల్లె నుంచి వెళ్లిన 20 మందితో పాటు ఇద్దరు కానిస్టేబుల్స్ తిరిగి ఖాళీగా మదనపల్లెకు వచ్చేశారు. ఇదిలా వుండగా పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకెళ్లిన 67 వాహనాలను కడప జిల్లా చక్రాయపేట, తదితర ప్రాంతాలకు రవాణా చేశారంటే.. వాహనాల స్కాం ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

చక్రాయపేట మండలంలోని కుప్పగుట్టపల్లె, నాగులగుట్టపల్లె, చిలేకాంపల్లె, దేవరగుట్టపల్లె, తదితర గ్రామాల్లో తాకట్టు పెట్టిన వాహనాల్లో మూడింటిని రుణదాతలకు తెలియకుండా మధ్యవర్తులు దొంగగా తెచ్చేసినట్లు చెబుతున్నారు. తాము ఎక్కడెక్కడ, ఎవరెవరికి వాహనం ఇచ్చిందీ వారికి తెలుసు. ఈ నేపథ్యంలో వాహనం ఎక్కడ తిరుగుతోందో, రాత్రివేళలో ఎక్కడ పార్కింగ్ చేస్తారో జీపీఎస్ ట్రాక్ ద్వారా ముందుగానే పసిగడతారు. అసలే చలికాలం.. రాత్రివేళలో ఇంట్లో నిద్రిస్తున్న వేళ అప్పటికే తమ వద్ద సిద్ధంగా ఉంచుకున్న రెండో కీ ద్వారా తెచ్చేస్తున్నారు. తెల్లవారి చూసుకున్న బాధితులు లబోదిబోమంటున్నారు. అప్పటి వరకూ జీపీఎస్ ట్రాక్ విషయం తెలియని వారంతా.. అలెర్ట్ అయ్యారు. తాకట్టు పెట్టుకున్న మిగిలిన వాహనాలను మెకానిక్ వద్దకు తీసుకెళ్లి, ట్రాకింగ్ సిస్టమ్‌ను తీసేస్తున్నారు. ఇలా ఒకదాని తర్వాత మరొకటి బయట పడుతుండటంతో వారూ అలెర్ట్ అయ్యారు. వారూ తమ డబ్బులు వచ్చేంత వరకూ వాహనాలను ఊర్లేకాదు.. జిల్లాలను దాటిచ్చేస్తున్నట్లు సమాచారం.

తక్కువకు వస్తోందని..


రూ.5 లక్షలు, రూ.10 లక్షలు విలువ చేసే వాహనం రూ.లక్ష, రూ.లక్షన్నరకు తాకట్టు పెడుతుండటంతో డ్రైవింగ్ నేర్చుకునే, సరదాగా టూర్‌వెళ్లే, హోదాకు చిహ్నంగా భావించే.. ఇలా ఒకరిని చూసి మరొకరు వాహనాలను తీసుకున్నట్లు చెబుతున్నారు. తక్కువ ధరకు రావడం, కొందరైతే వడ్డీకి ఇచ్చే సొమ్ములకు ష్యూరిటీగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు. కొన్నిచోట్ల వాహన యజమాని, మీడియేటర్ ముఠాగా ఏర్పడుతున్నారు. వాహనాన్ని మూడో వ్యక్తికి తాకట్టు పెట్టి, వాహనం చోరీ అయిందని పోలీసులకు ఫిర్యాదు చేస్తారు. ఆలోగా మధ్యవర్తి కనిపించకుండా పోవడం, కేసుల భయంతో డబ్బులిచ్చిన వారు మాత్రం.. కేసు లేకుండా వాహనం వదిలేయాల్సిన పరిస్థితి కూడా ఉంటోంది. తాకట్టు సొమ్మును మధ్యవర్తి, వాహన యజమాని పంచుకుంటున్నట్లు కూడా చెబుతున్నారు. అలాగే కొన్నిచోట్ల చోరీ, రికార్డులు లేని వాహనాలు వచ్చిన కాడికి రానిలే అన్నట్లు ఎంతో కొంతకు మార్టిగేజ్ పెట్టేసి సొమ్ములు తీసుకుంటున్న ఉదంతాలు కూడా ఉన్నాయి.

సీన్ కట్ చేస్తే.. వాల్మీకిపురంలో..

తమకు వచ్చిన ఫిర్యాదులపై తాలూకా పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా, ఇదే తరహాలో వాల్మీకిపురం నుంచి కూడా వాహనాలను అద్దెకు తీసుకెళ్లి చక్రాయపేట మండలంలో తాకట్టు పెట్టినట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై వాల్మీకిపురం పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిచ్చిన సమాచారం మేరకు చక్రాయపేటకు వెళ్లి, అక్కడ తాకట్టు పెట్టిన వాహనాలను తీసుకొచ్చారు. ఇలా వాహనాలను ఎక్కడెక్కడ అద్దెకు తెచ్చారో, ఎక్కడ తాకట్టు పెట్టారో పోలీసులు విచారణ చేస్తున్నారు. అయితే ఇలా అద్దె వాహనాలను తాకట్టు పెట్టే ముఠాతో పోలీసులకు సంబంధాలు ఉన్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. కొన్ని కేసుల్లో వీరినే పోలీసులు ఇన్‌ఫార్మర్లుగా వాడుకుంటున్నట్లు చెబుతున్నారు.

పొలానికి వెళ్లి తిరిగి వస్తూ.. అనంత లోకాలకు

- ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు
- ఒకరు మృతి, మరొకరికి గాయాలు


బోల్తాపడిన ట్రాక్టర్, రోడ్డు సైడుకు దూసుకెళ్లిన కారు

సంబేపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వారు ఇద్దరూ అన్నదమ్ములు. సొంత ట్రాక్టర్ తీసుకొని పొలం దున్నకాలకు వెళ్లారు. పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో వస్తూ ఉండగా కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి గుట్టపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు ఖాదర్‌వల్లి (25)ని కబలించింది. అతని సోదరుడు సాయిపీర్ తీవ్రగాయాలతో కాలు విరిగిన సంఘటన చోటు చేసుకుంది. సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం కట్టుగుత్తపల్లెకు చెందిన ఖాదర్‌వల్లి, సాయిపీర్ ఇరువురూ సోమవారం ఉదయం సదుం సమీ పంలో పొలం దున్నకాలకు వెళ్లినట్లు తెలిపారు. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో వస్తూ ఉండగా కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి గుట్టపల్లి సమీపంలో రాగానే కలకడ వైపు నుంచి వస్తున్న కారు ట్రాక్టర్‌ను వెనుకభాగంలో ఢీకొనడంతో ట్రాక్టరు బోల్తాపడింది. కారు రోడ్డు సైడ్ దిగింది. కారులో ఉన్న వ్యక్తులకు స్వల్పగాయాలు కాగా ట్రాక్టర్‌లో ఉన్న అన్నదమ్ములు ఇరువురిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి కాలు విరిగి రక్తగాయాలైనట్లు తెలిపారు. స్థానికులు మృతుని కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందజేయడంతో ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో మృతుని బంధువులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

పొలంలో బయటపడ్డ పురాతన విగ్రహాలు


పురాతన విగ్రహాలు

తంబళ్లపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోటకొండలో ఓ రైతు పొలంలో రెండు పురాతన రాతి దేవతా విగ్రహాలు బయటపడ్డాయి. గ్రామస్థులు వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం కోటకొండ పంచాయతీ మద్దిరాలపల్లె సమీపంలో ఎస్.రంగారావుకు చెందిన భూమిని ఇదే పంచాయతీ ఏటిగడ్డపల్లెకు చెందిన వెంకటేష్ కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం టమోటా నాటేందుకు భూమిని ట్రాక్టర్‌తో దుక్కి దున్నించాడు. సోమవారం ఉదయం దుక్కి దున్నిన పొలంలో రైతు నడుచుకుని వెళుతుండగా ఎత్తుగా రాయి ఉన్నట్లు కనిపించింది. దీంతో వెంటనే రాయిని వెలికితీసి పరిశీలించగా సుమారు ఒకటిన్నర అడుగు పొడవు, అడుగు వెడల్పు ఉన్న రెండు రాతి విగ్రహాలు బయల్పడ్డాయి. ఇందులో ఒక విగ్రహం రామానుజాచార్యులది కాగా, మరో విగ్రహం అమ్మవారిది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయం గ్రామస్థులకు తెలియడంతో తండోప తండాలుగా వెళ్లి విగ్రహాలను ఆసక్తిగా తిలకించారు. విగ్రహాలను శుభ్రపరచి పసుపు పూసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కాగా, విగ్రహాలు బయటపడిన పొలానికి సమీపంలో పూర్వం ఓ చిన్న చెరువు ఉండేదని, అప్పట్లో కురిసిన వర్షాలకు ఆ చెరువు కట్ట తెగిపోయి కిందనే ఉన్న ఆలయంపై మట్టి పడి అందులో ఉన్న విగ్రహాలు పూడిపోయి ఉంటాయని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాలు సుమారు 300 ఏళ్ల క్రితం నాటివి ఉండవచ్చని గ్రామస్తులు అనుకుంటున్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

మదనపల్లెఅర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు.. మదనపల్లె మండలం, టేకులపాలెంకు చెందిన నరసింహులు (42) సోమవారం ఉరివేసుకుని మృతి చెందాడు. ఆరునెలల క్రితం భార్య తులసీ కుటుంబ కలహాలతో పుట్టిల్లు కోళ్ల వారిపల్లెకు వెళ్లి తిరిగి కాపురానికి రాలేదని మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించే లోపే మృతి చెందాడని, వెంటనే మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మైదుకూరురూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో సోమవారం అక్రమరవాణాకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు డీఆర్‌ఓ అన్వర్‌హుస్సేన్ తెలిపారు. జిల్లా అటవీ శాఖాధికారి వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు వనిపెంట సమీపంలోని నల్లమల అడవిలో ఫారెస్ట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రవాణాకు సిద్ధంగా ఉంచిన 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అదుపులోకి తీసుకోగా.. కొందరు పారిపోయినట్లు తెలిపారు. నిందితుల పేర్లు, వారి సమాచారం గోప్యంగా ఉంచారు. కార్యక్రమంలో వనిపెంట ఫారెస్ట్ రేంజర్ ప్రణీత్ రావు, అన్వర్‌హుస్సేన్, బీట్ ఆఫీసర్లు సుచరిత, గంగాధర్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.


ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొన్న ఫారెస్ట్ అధికారులు

'అయ్యో'ర్లపై రాఘవరెడ్డి తిట్ల దండకం

- నోరు తెరిస్తే బూతులు, దుర్భాషలు
- తన ప్రాపకముంటే ప్రమోషన్ లేదంటే సస్పెన్షన్
- ప్రభుత్వమిచ్చిన నోటీసులో విస్మయం కలిగించే అంశాలు

కలికిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): "అరె.. యూస్‌లెస్ ఫెలో.. పనికిమాలిన గాడిద కొడకా.. అరె మెంటల్.." ఈ తిట్లు పడ్డవారు ఎవరో కాదు సాక్షాత్తు గౌరవప్రదమైన వృత్తిలో వున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు. తిట్టిన వారెవరో కాదు.. వై.రాఘవరెడ్డి. కడప జిల్లా కేంద్రంగా డీఈవోగా, ప్రాంతీయ సంయుక్త సంచాలకుడిగా ఉన్నత స్థాయిలో పనిచేస్తూ విద్యా వ్యవస్థను పర్యవేక్షించాల్సిన అధికారి. ఇవన్నీ కల్పిత ఫిర్యాదులు కూడా కావు. సాక్షాత్తు రాష్ట్ర గవర్నరుకు అందిన ఫిర్యాదుపై ఇద్దరు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు కూలంకషంగా విచారణ చేసి రుజువులతో సహా తేల్చిన నిజాలు. ఈ విషయాలన్నిటిని కూడా సాక్షాత్తు ప్రభుత్వమే వెల్లడించింది. రాఘవరెడ్డిపై వచ్చిన అభియోగాల గురించి ప్రభుత్వ పరంగా విచారణ జరపడం కోసం ఆదివారం ఆయనకు జారీ చేసిన నోటీసులో విస్తుగొలిపే పలు అంశాలున్నాయి. అవి యథాతథంగా.. నందలూరు మండలం పొత్తపి పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.వెంకట్రమణకు ఫోను చేసి "యూస్‌లెస్ ఫెలో, పనికిమాలిన గాడిద కొడకా, మెంటలా.. చట్ట విరుద్ధంగా పనిచేసున్నావు.. మెంటలా" అంటూ దుర్భాషలాడాడు. తరువాత అదే స్కూల్లో పనిచేసే ఆయన భార్యతో అతడికి అన్నం పెట్టొద్దు. పిల్లలను జాగ్రత్తగా చూసుకోమంటూ సలహా ఇచ్చాడు. రాష్ట్ర ఎస్‌సీఈఆర్టీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి కేశవరెడ్డికి ఫోను చేసి గాడిదనాకొడకా అంటూ దూషించాడు. ఇక కడపలోని చంద్రమౌళి విద్యాలయం కరస్పాండెంట్‌ను చెప్పలేని భాషలో దురుసుగా మాట్లాడాడు.

పరిపాలనాపరమైన అక్రమాలు

ఇవన్నీ ఒక కోణంలోనివి కాగా పాలనా పరమైన పలు అంశాల్లో ఆయన నియమాలను అతిక్రమించి వ్యవహరించినట్లు ప్రభుత్వం పేర్కొంది. లింగాల మండల వెలిదండ్ల పాఠశాల హెచ్‌ఎం బి.మురళీకృష్ణకు నాడు-నేడు పనులతో ఎలాంటి సంబంధం లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశాడు. నాగులగుట్టపల్లె టీచర్ ఎస్.రామమోహన్ ఒక ఆర్టీసీ డ్రైవర్ గొడవపడిన కారణంగా సస్పెండ్ చేశాడు. వాస్తవానికి ఇది పూర్తిగా ప్రైవేటు వ్యవహారం. కనీసం దీనిపై పోలీసు స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ కూడా లేదు. సస్పెండ్ చేయాలంటే కేసు నమోదై కనీసం 48 గంటలు పోలీసుల కస్టడీలో వుండాలి. అయినా సస్పెండ్ చేయడం విరుద్ధమంటూ ప్రభుత్వం పేర్కొంది. ఇక ఒక ఉన్నతాధికారిగా అనేక నియమాలను అతిక్రమించారనేది మరి కొన్ని ఆరోపణలు. పుల్లంపేట మండలం రామసముద్రం హెచ్‌ఎం పి.పొట్టిరెడ్డిని ఆయన అభ్యర్థనపై నియమ విరుద్ధంగా 16 శాతం ఇంటి అద్దె అలవెన్సు వచ్చే విధంగా బదిలీ చేశాడు. అదే విధంగా 16 శాతం హెచ్‌ఆర్‌ఏ కోసం రాజంపేట మండలం పలపుత్తూరు హెచ్‌ఎం వై.హేమలతను కంచర్లపల్లెకు, మరో హెచ్‌ఎం బి.ఆనందనాయక్‌ను పుల్లంపేట మండలం రెడ్డిపల్లె నుంచి రాయచోటికి, వై.సుశీలను వీరబల్లి మండలం లగ్గిశెట్టిపల్లె నుంచి పదోన్నతి మీద కుమ్మరపల్లెకు బదిలీ చేశారు. పెనగలూరు నుంచి వి.వెంకటేశ్వర్లును కౌన్సెలింగ్‌లో ఖాళీ లేకున్నా బెదిరించి జి.కె.రాచపల్లెకు బదిలీ చేశారు. కౌన్సెలింగ్‌లో అదనపు పాయింట్ల కోసం తప్పులు చేసిన కలసపాడు మండలం ఎగువరామాపురం టీచర్ అర్లి విజయలక్ష్మిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకోకుండా అలసత్వం వహించాడు. అదే విధంగా అదే పాఠశాలకు చెందిన హెచ్‌ఎం మస్తాన్‌వల్లిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపకుండా నిర్లక్ష్యం వహించాడు. కౌన్సెలింగ్‌కు హాజరుకాకపోయినా పట్టణ ప్రాంతంలో నియమించాడు. చెన్నూరు మండలం దౌలత్‌పురం టీచరు కె.రమణారెడ్డిని కన్సిస్టెంట్ రెయిమ్స్ నోడల్ అధికారిగా, కడప అశోక్‌నగర్‌కు చెందిన రమేష్‌బాబును స్కూల్ సేఫ్టీ జిల్లా మానిటరింగ్ అధికారిగా ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే నియమించారు. కౌన్సెలింగ్ కోసం తప్పుడు వివరాలు సమర్పించిన వారిని ప్రాసిక్యూషన్ చేయాలనే నిబంధనలున్నా వారిని కనీసం ఖాళీలున్న మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాల్సి వున్నా పట్టించుకోకపోవడం వంటి అభియోగాలతో రాఘవరెడ్డిపై ప్రభుత్వం విచారణకు సిద్ధమవుతోంది. పది రోజుల్లోగా ఆయన నుంచి సంజాయిషీ అందిన అనంతరం తగు చర్యలు తీసుకోనున్నారు. కాగా రాఘవరెడ్డి వ్యవహారశైలి గురించి ప్రభుత్వం ఆపాదించిన అభియోగాల గురించి జిల్లాల్లోని ఉపాధ్యాయ వర్గాల్లో విస్తృత చర్చ నడుస్తోంది.

పారదర్శక సేవలు... ప్రగతికి అడుగులు

- స్వర్ణ పంచాయతీ పేరిట కూటమి సర్కార్ శ్రీకారం
- గ్రామాల ఆదాయ వనరులు నమోదు
- అందుబాటులోకి వస్తే పౌరసేవలు సులభతరం

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. స్వర్ణ పంచాయతీ పేరిట ఆన్‌లైన్ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రతి చెల్లింపు ఆన్‌లైన్‌లో నిర్వహించేలా డిజిటలైజేషన్ చేస్తున్న నేపథ్యంలో పంచాయతీల్లో పారదర్శకత, జవాబుదారితనం పెరగనుంది. వివరాల్లోకి వెళితే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయి. ఎటువంటి అభివృద్ధి పనులకు నోచుకోలేదు. మౌలిక వసతుల కల్పన కుంటుపడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామాల సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. పంచాయతీల్లో అక్రమాల నిరోధానికి చర్యలు చేపడుతోంది. ప్రజలకు పారదర్శకంగా సమాచారం, సేవలు అందించేందుకు వీలుగా 'స్వర్ణ పంచాయతీ' వెబ్‌సైట్‌కు రూపకల్పన చేశారు. డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు సర్కారు సన్నద్ధమవుతోంది. దీని ద్వారా ఎక్కడ ఉన్నా పన్నులు సకాలంలో చెల్లించే వెసులుబాటు కల్పించనున్నారు. ఇందుకుగాను స్వర్ణ గ్రామ పంచాయతీ వెబ్‌సైట్ అందుబాటులో ఉంచారు. దీని ద్వారా ప్రజలకు సేవలు సులభతరం కానున్నాయి.


వెబ్‌సైట్‌లో వివరాలను పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ రామాంజనేయులరెడ్డి, కార్యదర్శి తేజశ్విని

అక్రమాలకు అడ్డుకట్ట

పంచాయతీల్లో పన్నుల రూపంలో వచ్చిన ఆదాయానికి గండికొట్టకుండా డిజిటల్ విధానం ఉపయోగపడుతోంది. గతంలో పలు గ్రామాల్లో పన్నుల దుర్వినియోగం అయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. నిధుల దుర్వినియోగం కావడం, ఆలస్యంగా వెలుగు చూడడం.. వాటిపై ఫిర్యాదులు, దర్యాప్తులు, విచారణ పరిపాటిగా మారింది. వీటినన్నింటికి ఈ కొత్త విధానంతో అడ్డుకట్ట పడుతుందని అధికారులు చెబుతున్నారు.

ఆదాయ వనరుల నమోదు

పంచాయతీల్లో ఎలాంటి లావాదేవీలు జరిగినా స్వర్ణ పంచాయతీ పేరిట ఆన్‌లైన్ చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి పైసా, ప్రతి పని ఇకపై పక్కాగా లెక్క తేలనుంది. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఆదేశాల మేరకు నివాస గృహాల పన్నులకు సంబందించిన పూర్తి సమాచారాన్ని కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అసెస్‌మెంట్లవారీగా ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. త్వరితగతిన ఈ పక్రియ పూర్తి చేసి డిజిటల్ రూపంలో సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటికే సుమారు 90 శాతం పైగా వివరాల నమోదు జరిగింది. ప్రొద్దుటూరు మండల పరిధిలోని 15 పంచాయతీల్లో ఉన్న 25 సచివాలయాలకు గాను 33,908 కుటుంబాలు ఉన్నాయి. స్వర్ణపంచాయతీ వెబ్‌సైట్‌లో మొదటగా పంచాయతీ ముఖచిత్రం లోడ్ చేస్తారు. ఇంటి విస్తీర్ణం, హద్దులు, యజమాని వివరాలు, ఏడాదికి ఎంత పన్ను చెల్లిస్తున్నారు, ఆస్తి, వ్యాపార సముదాయాలకు సంబందించి పన్నులు, చెరువులు, స్థలాలు, లీజు, సెల్‌టవర్లు, పరిశ్రమలు, రోజువారి వ్యాపారాల నుంచి చేస్తున్న వసూళ్లు ఇలా.. పంచాయతీలకు ఆదాయం తెచ్చే వాటి వివరాలను నమోదు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లోజరుగుతున్న అక్రమాలకు ఈ స్వర్ణ పంచాయతీలతో ఇకపై చెక్ పడనుంది. పన్నుల రూపంలో పంచాయతీలకు వస్తున్న ఆదాయం పక్కదారి పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ఆన్‌లైన్ ద్వారా పొందే అవకాశం



స్వర్ణ పంచాయతీల పేరుతో ప్రభుత్వం పౌరసేవలను సులభతరం చేస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమకు అవసరమైనధ్రువీకరణ పత్రాలు, అనుమతులు ఆయా పంచాయతీల నుంచి ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు. ఇంటి పన్ను, ఇతర రుసుంలను అదే విధానంలో చెల్లించే వెసులుబాటు కలుగుతుంది. పంచాయతీల అభివృద్ధికి డిజిటల్ సేవలలు ఎంతగానో ఉపయోగపడుతాయి.

- ఎస్.సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీవో, ప్రొద్దుటూరు.

దేశ వ్యాప్తంగా బీసీల సమగ్ర కుల గణన చేపట్టాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు


కలెక్టరేట్ ఎదుట చేపట్టిన మహా ధర్నాలో మాట్లాడుతున్న దుడం రెడ్డిబాబు

కడప మారుతీనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా సమగ్ర బీసీల కులగణన కార్యక్రమాన్ని చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దేశంలో కేవలం 5 శాతం వున్న అగ్రవర్ణాలకు కల్పించిన ఈడబ్ల్యుఎస్ 10 శాతం రిజర్వేషన్‌లను వెంటనే రద్దు పరచాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా చేపట్టారు. అంతకుముందు నగర మహావీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 75 సంవత్సరాలు అవుతున్నా నేటికీ బీసీ వర్గాల జనాభా తాలూకు సంఖ్యను తెలియపరచే సమగ్ర కుల గణన చేపట్టకపోవడం దారుణమన్నారు. మేమెంతో మాకంత వాటా ఇచ్చి తీరాలన్నారు. బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు కల్పించి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో తగిన ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న ఆంజనేయులు, అవ్వారు మల్లికార్జున, మదన్, మణికుమార్, వీరభాస్కర్, శివరామ్, రాష్ట్ర మహిళా నాయకురాలు ప్రశాంతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు రామలక్షుమ్మ పాల్గొన్నారు. అనంతరం జేసీని కలిసి వినతిపత్రం అందజేశారు.

రవీంద్రనగర్‌లో చోరీ

- ఐదు తులాల బంగారు, రూ.2లక్షలు నగదు అపహరణ


బీరువాను ధ్వంసం చేసిన దృశ్యం

కడప క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం రవీంద్రనగర్‌లోని కిరణ్ బార్ సమీపంలోని ఓ ఇంటిలో దొంగలు పడ్డారు. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు, రూ.2లక్షలు నగదును అపహరించినట్లు బాధితురాలు షేక్ సత్తాజ్ తెలిపారు. ఆమె వివరాల మేరకు.. శనివారం పిల్లవాన్ని తీసుకుని మదనపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆమె భర్త కూడా ఇటీవల కువైట్‌కు వెళ్లారు. దీంతో ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బీరువాను ధ్వంసం చేసి బంగారు నగలు, డబ్బు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు తాలుకా పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. కాగా ఇంటి బయట, ఇంటిలో పల మొత్తం రక్తం మరకలు ఉన్నాయి. అయితే తమ బంధువులు ఎవరితో అయినా కలిసి చోరీ చేసినట్లుగా ఆమె అనుమానం వ్యక్తం చేస్తోంది.

తొమ్మిది మందిపై కేసులు

చాపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నవాడ గ్రామానికి చెందిన తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 19న ఆదివారం రాత్రి రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. గంగయ్య అనేవ్యక్తి తన పొలంలోని పైరుకు నీరు పెడుతుండగా పక్కనే ఉన్న పాపయ్య తోటలోకి ఆ నీరు పారి అతని వరిగడ్డి తడిసిపోయింది. ఈ విషయమై ఒకరిపై మరొకరు కట్టెలు, రాళ్లతో దాడి చేసుకోగా వారితలలకు, చేతులకు గాయాలయ్యాయి. ఈఘటనకు సంబంధించి గంగన్న, ప్రసాద్, గంగమ్మ, చిన్నగంగన్న, పాపయ్య, సాయికుమార్, లక్ష్మినారాయణ, మరో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్టు

కడప క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిలకలబావి వద్ద గత నవంబరు నెలలో జరిగిన ఘర్షణకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. చిలకలబావికి చెందిన అరాఫత్‌కు అదే ప్రాంతానికి చెందిన రియాజ్‌ల మధ్య మనస్పర్థలు ఉండేవి. నవంబరు 18న రాత్రి అరాఫత్‌పై రియాజ్ అతని అనుచరులు దాడి చేసి గాయపరిచారు. ఈ కేసులో కడపకు చెందిన ఏపీ ఖాదర్ వల్లిఖాన్, షేక్ మహ్మద్ బాబా అలియాస్ తాజ్, పఠాన్ హతహుల్లా అలియాస్ అతుల్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రి సీజ్

పోరుమామిళ్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని పోలీసుస్టేషను ఎదురుగా ఉన్న గంటా చిన్నపిల్లల హాస్పిటల్‌ను వైద్యాధికారులు సీజ్ చేశారు. ఆసుపత్రిలో కారు రామయ్య అనే వ్యక్తి ఇంజక్షన్ వికటించి మరణించిన విషయం తెలిసిందే. ఈవిషయమై సోమవారం ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లేశ్, డాక్టర్ జనార్దన్ విచారణ నిమిత్తం ఆసుపత్రికి వచ్చారు. డాక్టరు అందుబాటులో లేకపోవడంతో ఆ ఇంటి యజమానితో పాటు ఎస్ఐ కొండారెడ్డితో చర్చించి హాస్పిటల్‌కు క్లోజ్డ్ స్టిక్కరు అంటించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత జిల్లా అధికా రులు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేస్తుండగా ప్రమాదం

- ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర అస్వస్థత
- సకాలంలో స్పందించిన పోలీసులు
- అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు



మృతి చెందిన నాగయ్య, చికిత్స పొందుతున్న చంద్రశేఖర్

కడప క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని రిమ్స్ పీఎస్ పరిధిలో రామాంజనేయపురం ఆచార్ల కాలనీలో సోమవారం ఉదయం సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు మజ్జారి నాగయ్య (44) అనే వ్యక్తి మృతి చెందగా... మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనపై స్థానికులు పోలీసు లకు సమాచారం అందించడంతో రిమ్స్ పీఎస్ సీఐ సీతారామిరెడ్డి, సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని.. అగ్నిమాపక శాఖ సిబ్బంది సహాయంతో సెప్టిక్ ట్యాంక్‌లో ఇరుక్కుపోయిన వ్యక్తులను బయటికి తీసి రిమ్స్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..


కడప రామాంజనేయపురం ఆచార్లకాలనీకి చెందిన బిక్కిలి అరుణ్‌కుమార్ (39) తన ఇంటి ముందు సెప్టిక్ గుంతను సెప్టిక్ ట్యాంకరు ద్వారా శుభ్రం చేయించారు. ఆ తర్వాత మరింత మురికి బయటకు వచ్చేందుకు యాసిడ్‌ను అందులో వేశారు. మరికొంత సమయానికి నాగయ్య అనే వ్యక్తి సెప్టిక్ ట్యాంకును శుభ్రం చేసేందుకు లోపలికి దిగి ఊపిరి ఆడక పడిపోయాడు. నాగయ్యను కాపాడే ప్రయత్నంలో అరుణ్‌కుమార్ లోపలికి దిగి తాను అవస్థతకు గురయ్యాడు. దీంతో స్థానికుల కేకలు వేయడంతో మజ్జారి చంద్రశేఖర్ (26) అనే మరో వ్యక్తి వారిద్దరినీ కాపాడే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఒకరి తరువాత మరొకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన సీఐ సీతారామిరెడ్డి, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సెప్టిక్ ట్యాంక్‌లోని వారిని కాపాడే ప్రయత్నంలో సీఐ కూడా కొంత అస్వస్థతకు గురయ్యారు. ఈ లోపు అగ్నిమాపకశాఖ వారికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని.. ప్రమాదంలో చిక్కుకున్న నాగయ్యను తాళ్లతో బయటికి లాగి 108లో రిమ్స్‌కు తరలించగా... కొంతసేపటికి మృతి చెందాడు. అరుణ్‌కుమార్, చంద్రశేఖర్‌లు చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. కాగా మృతుడు నాగయ్య బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య లక్ష్మిదేవి, చంద్రిక, చరణ్, చంద్ర అనే ముగ్గురు సంతానం.


రిమ్స్‌లో రోదిస్తున్న మృతుని బంధువులు

హత్యాయత్నం కేసులో 12 మందికి మూడేళ్ల జైలు శిక్ష

వీరపునాయునిపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): 2014లో జరిగిన హత్యాయత్నం కేసులో 12 మందికి మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని ఎరమలపల్లె గ్రామంలో బొమ్మరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, అతని భార్య అరుణలకు 2005లో వివాహమైంది. ఇద్దరు పిల్లలు అనంతరం భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా పెద్దమనుషులు పంచాయతీ మేరకు ఎవరికి వారు విడివిడిగా కాపు ఉండేవారు. ఈ క్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి తన భార్య, పిల్లల జీవనోపాధి నిమిత్తం రూ.12లక్షలు ఎల్‌ఐసీ బాండ్లు, డబ్బు మరియు నాలుగు సెంట్ల స్థలం ఇచ్చాడు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి గ్రూప్-2 పరీక్షలో సెలెక్ట్ అయి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం వచ్చింది. అనంతరం అతని భార్య, మరికొందరు కలిసి ఇంకా తమకు ఎక్కువ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ చేసుకుందామని పిలిపించి చంద్రశేఖర్‌రెడ్డిపై, అతని బంధువైన రామకృష్ణారెడ్డి అనే అతనిపై రాడ్లు, కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎస్‌కే రోషన్ కేసు నమోదు చేశారు. ఈ కేసు ప్రొద్దుటూరు అసిస్టెంట్ సెషన్ జడ్జి కోర్టులో విచారణకు రాగా ప్రస్తుత ఎస్ఐ మంజునాథ్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చగా.. 12 మందికి మూడేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ఇష్టంలేని పెళ్లి చేశారని... యువతి ఆత్మహత్య


లక్ష్మీకళ (ఫైల్ ఫొటో)

మైలవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తనకు ఇష్టంలేని పెళ్లి చేశారని జీవితంపై విరక్తి చెంది గోరంట్ల లక్ష్మీకళ (20) అనే వివాహిత మైలవరం జలాశయంలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్యాం సుందర్‌రెడ్డి వివరాల మేరకు... దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన లక్ష్మీకళను గూడెం చెరువుకు చెందిన రామాంజనేయులుకు ఇచ్చి అయిదు నెలల క్రితం వివాహం చేశారు. సంక్రాంతి పండుగకు పుట్టిళ్లు అయిన దొమ్మరనంద్యాల గ్రామానికి వచ్చి తల్లివద్ద ఉండేది. 18వ తేదీ దొమ్మరనంద్యాలలోని ఇంటి నుంచి తల్లికి చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో లక్ష్మీకళ తల్లి తన కూతురు కనిపించడంలేదని మైలవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం మైలవరం జలాశయంలో మహిళా మృతదేహం లభ్యం కావడంతో జాలర్ల సాయంతో బయటకు తీసి.. లక్ష్మీకళ అని నిర్ధారించుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విషద్రావణం తాగి మహిళ మృతి

సింహాద్రిపురం, జనవరి 20 (ఆంధ్రజ్యో తి): మండలంలోని అగ్రహారం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన ప్రభావతి (55) కడుపునొప్పి తాళలేక విషద్రావణం తాగి నట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఆమె గత నెల రోజులుగా కడుపునొప్పితో బాధపడుతండేది. ఈ నెల 17వ తేదీ చీనీ చెట్లకు పిచికారి చేయడానికి తెచ్చిన పురుగుల మందు తాగింది. దీంతో అపస్మారక స్థితిలో వున్న ప్రభావతిని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది.

జిల్లా విద్యాశాఖాధికారిగా షంషుద్దీన్



కడప ఎడ్యుకేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా తాండ్రపాడు డైట్ సీనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.షంషుద్దీన్‌ను కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోనశశిధర్ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న యు.మీనాక్షిని రిలీవ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు షంషుద్దీన్ కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా కొనసాగుతారని సూచించారు. మీనాక్షి యదావిధిగా ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖాధికారిగా కొనసాగుతారు. అయితే మీనాక్షి డీఈఓగా మాకొద్దు అంటూ ఉపాధ్యాయ సంఘాలు ఈ మధ్యకాలంలో ధర్నాలు చేయడం జరిగింది.

మా భూములు మాకు దక్కేలా చూడండి

- తహసీల్దారు వద్ద మాలల మొర


తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న మాలలు

ముద్దనూరు జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వంశపారపర్యంగా వస్తున్న మాలల మాన్యం భూములను చిన్న దుద్యాల గ్రామం వైసీపీకి చెందిన భూమిరెడ్డి గంగమ్మ పేరుతో కుటుంబ సభ్యులు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పెద్ద దుద్యాల గ్రామానికి చెందిన మాలలు వరదమ్మ మరి కొందరు సోమవారం తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ తమ సొంత గ్రామం పెద్దదుద్యాల గ్రామం అయినా చిన్నదుద్యాల గ్రామానికి కూడా తమ పూర్వీకులు కాటి కాపరి పనులు చేస్తుండేవారన్నారు. తమ పూర్వీకులకు 1910 సంవత్సరంలో చిన్న దుద్యాల గ్రామంలో సర్వే నెంబర్100లో దాదాపు 10.50 ఎకరాల భూమి అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం మాలలకు మాన్యం ఇచ్చిందన్నారు. 1956 నుంచి ఆర్‌హెచ్, ఆర్ఎస్ఆర్‌లో కూడా నమోదయ్యిందన్నారు. అప్పటి నుంచి ఎవరి పేరు మీద ఎటువంటి మార్పు చెందలేదన్నారు. 2007 సంవత్సరంలో చిన్నదుద్యాల గ్రామానికి చెందిన భూమిరెడ్డి నాగశివారెడ్డి అనే వ్యక్తి పక్కా పథకం ప్రకారం తమ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. మొదట పోలు లక్ష్మినారాయణమ్మ పేరుతో అక్రమ పట్టాదారు పాస్‌బుక్ పుట్టించారు. తరువాత అదే సంవత్సరం తన తల్లి భూమిరెడ్డి గంగమ్మపేరుపై రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆమె మరణాంతరంభూమిరెడ్డి నాగశివారెడ్డి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. తరువాత 2022లో తన కొడుకు నాగార్జునరెడ్డికి రిజిష్టర్ చేయించారని ఆరోపించారు. తమ మాన్యం భూమి తమకు దక్కేలు చర్యలు తీసుకోవాలని తహసీల్దారుకు బాధితులు విన్నవించుకున్నారు. దీనిపై తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాలలు బాబు, రాజు, మేరి, వాసు, సుధ, రమేష్‌లు పాల్గొన్నారు.

రేపు గండికోట నిర్వాసితుల గుర్తింపు ఆధార పత్రాల పరిశీలన

జమ్మలమడుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ కార్యాలయ సభాభవనంలో ఈనెల 22వ తేదీ గండికోట నిర్వాసితుల గుర్తింపు ఆధార పత్రాల పరిశీలన ఉంటుందని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. గండికోట జలాశయం కింద కొండాపురం మండలంలో ముంపు గ్రామంగా ప్రకటించిన పి.అనంతపురం గ్రామ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ గెజిట్‌లో పేర్లు నమోదుకు బియ్యం కార్డు, ఆధార్‌కార్డు, జాబితా బ్యాంకు పాసుపుస్తకం, విద్యార్హత, ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోవాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు, ఇతరత్రా పత్రాలతో ఎవరైతే గతంలో హాజరు కాలేదో అలాంటి వారు రావాలన్నారు. నిర్వాసితులు తప్పుడు గుర్తింపు ఆధార పత్రాలను సమర్పిస్తే చర్యలు తప్పవన్నారు.

జాతీయస్థాయి చెస్‌లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు


కప్ అందుకుంటున్న అష్రఫ్ సుభాని

కడప స్పోర్ట్స్, జనవరి 20, (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ చెస్ ప్రైజ్ మనీ చెస్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన 23 మంది క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. ఇందులో ప్రధానంగా డి.అష్రఫ్ సుభాని ప్రథమ విజేతగా నిలిచి రూ.10 వేల నగదు బహుమతిని అందుకున్నారని జిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్ దర్బారి వెల్లడించారు. విభాగాల వారిగా అండర్-9 బాలికలలో లాస్యప్రియ తృతీయ విజేతగా, అండర్-11 బాలికల విభాగంలో దీపికా 2వ స్థానంలో, అండర్-15 బాలికల విభాగంలో తేజోమయి ద్వితీయ స్థానంలో, అండర్-7 బాయ్స్ విభాగంలో భార్గవ్ ద్వితీయ స్థానంలో, అండర్-13 బాలుర విభాగంలో అనురాగ్ నాల్గవ స్థానంలో.. ప్రేమ్ దీప్ 5వ స్థానంలో రాణించడం చాలా గొప్ప విషయమన్నారు.

23న హాకీ జట్టుకు ఎంపికలు

కడప స్పోర్ట్స్, జనవరి 20, (ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు నగర రిమ్స్ సమీప స్పోర్ట్స్ స్కూల్ హాకీ మైదానంలో జిల్లా హాకీ జట్టుకు సంబంధించి బాలికల సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మహిళల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ సెక్రటరీ శేఖర్ తెలిపారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో 2009 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. అలాగే జూనియర్ బాలికల విభాగంలో 2006 జనవరి 1 తర్వాత జన్మించిన బాలికలు, సీనియర్ విభాగానికి వయోపరిమితి లేదన్నారు. ఎంపికలో పాల్గొనే సబ్ జూనియర్, జూనియర్, క్రీడకారిణులు తమ వెంట ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8688446515 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సబ్‌కలెక్టరేట్‌కు చేరిన ఇళ్ల సమస్య

● సీటీఎంలో చినికి చినికి గాలివానలా మారుతున్న వైనం ● సబ్‌కలెక్టర్‌కు ఇరువర్గాల ఫిర్యాదు ●పోలీసు కేసుల కోసం ఒత్తిడి



సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ ఆనందపార్థసారధి, వెలుగు చంద్ర, బాధితులు



చిట్లాకుప్ప స్థలాన్ని కాపాడాలని సబ్‌కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీటీఎం గ్రామస్థులు

మదనపల్లె టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం-1 గ్రామ పంచాయతీలో హౌసింగ్ ఇళ్ల సమస్య సబ్‌కలెక్టరేట్‌కు చేరింది. ఇళ్ల కోసం కేటాయించిన స్థలంపై ఇరువర్గాల మధ్య వివాదం చినికిచినికి గాలివానలా తయారైంది. మూడు రోజులుగా ఈ స్థలంలోని ఇళ్ల పునాదు లను ఒక వర్గం వారు ఎక్స్‌కవేటర్‌తో తొలగించడంతో ఈ వివాదం ఘర్షణలకు దారితీసే వైపు వెళుతోంది. దీంతో ఇరు వర్గాల వారు మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకుని పోలీసు కేసుల కోసం ఒత్తిడి తెస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. సీటీఎం-1 పంచాయతీలో గతంలో హౌసింగ్ ఇళ్ల కాలనీ కోసం ప్రభుత్వం కొంత స్థలం సేకరించి ఇళ్లు కేటాయించింది. ఈ స్థలంలో అప్పట్లో కొంత మంది పట్టాలు పొంది పునాదులు నిర్మించుకున్నారు. మూడు రోజుల క్రితం ఇంకో వర్గం వారు ఆ స్థలం సంక్రాంతి చిట్లాకుప్ప స్థలం అని, అక్కడ పునాదులను ఎక్స్‌కవేటర్‌తో కూల్చేశారు. దీంతో బాధితులు మదనపల్లె తాలూకా పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు సీటీఎం సర్పంచ్ ఆనందపార్థసారధి, ఎంపీపీ రెడ్డెమ్మ భర్త వెలుగు చంద్ర బాధితు లతో కలసి వచ్చి ఫిర్యాదు చేశారు. గౌర కృష్ణమూర్తి, రఘు కుటుంబానికి చెందిన వారు పేదల పునాదులను దౌర్జన్యంగా కూల్చివేశారని హిందూ శ్మశాన వాటికను, గుండమ్మ చెరువును ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి చర్యల వలన సీటీఎం గ్రామం చెరువు తెగితే ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా సీటీఎం గ్రామంలో వెలుగు చంద్ర, సారథి కలసి కోట్లాది రూపాయల భూములు ఆక్రమించుకున్నారని, హౌసింగ్ లేఅవుట్లలో స్థలాలు ఆక్రమించుకున్నారని సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇలా ఇరు వర్గాలు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ స్పందించారు. వివాదస్పద స్థలం ఎవరిదో సర్వే చేయించి, తహసీల్దార్‌ను క్షేత్రస్థాయికి పంపి విచారిస్తామన్నారు. అంత వరకు ఇరువర్గాలు ఎలాంటి చర్యలకు దిగకుండా ఉండాలని సూచించారు.

రూ. 48లక్షలతో లైబ్రరీ, సైన్స్‌ల్యాబ్ భవనాల పనులు

మదనపల్లె అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీహైస్కూల్‌లో రూ.48లక్షలతో లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ భవనాల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా భూమిపూజ చేశారు. మహాకుంభమేళా నుంచి తీసుకొచ్చిన జలంతో పూజలు నిర్వహించడం ప్రత్యేకత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి నారాలోకేశ్ విద్యా రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధునాతన హంగులతో లైబ్రరీ, సైన్స్‌ల్యాబ్ భవనాల నిర్మాణానికి రూ.48లక్షలు మంజూరు చేయడం శుభపరిణామన్నారు. ఇప్పటికే డైనింగ్ హాల్ నిర్మాణం దాదాపుగా పూర్తి అయిందన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలన్నదే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఎస్టీయూ నాయకులు ఆర్‌వీ రమణ, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు నాగార్జునబాబు(గాంధీ), నవీన్ చౌదరి, యర్రపల్లె వెంకటరమణారెడ్డి, డాన్స్ రెడ్డెప్ప, కంచర్ల మల్లికార్జుననాయుడు, కత్తిలక్ష్మన్న, విజయ్‌కుమార్, సురేంద్రరెడ్డి, మల్లికార్జున, హరిబాబు, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

దారిని ఆక్రమించారని జేసీకి ఫిర్యాదు

వాల్మీకిపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలంలోని కూరపర్తి గ్రామ పంచాయతీ పరిధిలో తంగేళ్లగుట్టకు వెళ్లే మార్గంలో 190మీటర్ల మేరకు దారిని ఆక్రమించి మూసివేయడంతో ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం గ్రామానికి చెందిన రైతులు రాయచోటి కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కూరపర్తి గ్రామం నుంచి తంగేళ్లగుట్ట వరకు రెండు కిలోమీటర్ల మేరకు పూర్వం నుంచి బండిబాట ఉందని అయితే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమణదారులు 190మీటర్ల మేర ఆక్రమించి దారి లేకుండా చేశారని వాపోయారు. తక్షణం తమకు దారి సమస్య పరిష్కరించాలని రైతులు, గ్రామస్థులు జేసీకి విన్నవించగా పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పారన్నారు. ఫిర్యాదు చేసిన వారి లో ప్రదీప్, భాస్కర్, జయమ్మ, రెడ్డిరాణి, నాగరాజు, రాజారెడ్డి, అనసూయమ్మ పాల్గొన్నారు.

టి.పసలవాండ్లపల్లెలో రీసర్వే ప్రారంభం

గుర్రంకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలంలో రీ సర్వే సోమవారం తిరిగి ప్రారంభమైనట్లు తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగా టి.పసలవాండ్లపల్లెలో గ్రామంలో రెవెన్యూ సిబ్బంది సర్వేను మొదలుపెట్టారు. ఈ క్రమంలో మూడు బృందాలు గ్రామం సరిహద్దులను గుర్తించారు. ప్రతి రైతు భూమిని రీసర్వే బృందం ఖచ్చితంగా సర్వే చేసి హద్దులను చూపుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్లు వినోద్, కిరణ్ పాల్గొన్నారు.

ఇంటిని ధ్వంసం చేసిన గ్రామస్థులు

●పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

నిమ్మనపల్లె, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లె మండలంలోని దిగువపల్లెకు చెందిన చంద్రయ్య ఇంటిని గ్రామస్థులు ధ్వంసం చేసినట్లు బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యదు చేశాడు. ఈ సందర్భంగా బాధిడుతు చంద్రయ్య మాట్లాడుతూ..గత 16 ఏళ్లుగా తన సొంత ఇంటి జాగాలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తుండగా ఇంటి పైన మేడ ఏర్పాటు చేసినందుకు ఇంట్లో ఉన్న భార్య కుమారుడిపై గ్రామానికి చెందిన అనురాధ, రమణతో పాటు మరి కొంతమంది దాడి చేసి గాయపరిచినట్లు తెలిపాడు. దీనిపై పోలీసులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

పట్టపగలే ఇంట్లో చోరీ

ములకలచెరువు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఇంట్లో చోరి జరిగిన సంఘటన ములకలచెరువులో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు...ములకలచెరువులోని వినాయక నగర్లో కాపురం ఉంటున్న రహంతుల్లా ఆదివారం చౌడసముద్రంలో ఫంక్షనుకు వెళ్లాడు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా తెరచి అందులో ఉన్న రూ. 60 వేలు నగదు చోరీ చేసినట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి తలుపులు తెరచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గ్రహించి వెంటనే ములకలచెరువు పోలీసుల కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

చట్టానికి ఎవరూ అతీతులు కారు..



నిరసనకారులకు నచ్చచెప్పి పంపుతున్న డీఎస్పీ, సీఐ, పోలీసులు

రామసముద్రం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): చట్టానికి ఎవరూ అతీతులు కారని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం చట్టరీత్యా నేరమని మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్యానాయుడు పేర్కొన్నారు. మండలంలోని కురిజల, ఎగువ పాళ్యంకు సంబంధించి ఇరువర్గాల ఘర్షణలో ఎగువ పాళ్యంకు సంబంధించి ఆదివారం ముగ్గురిపై కేసు నమోదు చేసిన ఘటనపై దళితులు సోమవారం పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ, సీఐలు రామసముద్రం చేరుకుని దళితులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని వారిని శాంతింపజేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం పోలీసులను ఆశ్రయించాలి తప్పా చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం నేరమని, ఎవరికైనా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరగలేదని అనిపిస్తే సంబంధిత ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాలేగాని ఒకరిపై ఒకరు భౌతిక దాడులు చేయడం, పోలీసు స్టేషన్‌ను ముట్టడించడం సరైనది కాదని దళిత నాయకులకు హితవు పలికారు. అనంతరం ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

రెండు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

కలికిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశువైద్య శిబిరాల ఏర్పాటు కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో మొదటి రోజు పత్తేగడ పంచాయతీలో శిబిరాలు నిర్వహించారు. బాలయ్యకుంట వడ్డెపల్లె, పల్లెల్లవారిపల్లె గ్రామాల్లో నిర్వహించిన శిబిరాల్లో 256 పశువులు, 150 గొర్రెలకు ఉచితం నులి నివారణ మందులు అందజేశారు. 45 పాడి ఆవులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేశారు. మరో 25 సాధారణ కేసులకు కూడా చికిత్సతోపాటు అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కలికిరి ప్రాంతీయ వైద్యశాల ఏడీ డాక్టర్ వెంకటముని నాయుడు, పశు వైద్యాధికారి డాక్టర్ గిరిధర్ రెడ్డి, పశు వైద్య సహాయకులు వైద్య శిబిరాల్లో పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో సోమవారం మండల పశువైద్యాధికారి రమేష్‌నాయక్ అధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. పశువులకు వచ్చే వివిధ రకాల వ్యాధుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో 21 పశువులకు చికిత్స అందించారు. అదే విధంగా 789 గొర్రెలకు, 48 మేకలకు, 32 దూడలకు, 124 ఆవులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో సంచార పశువైద్యశాల డాక్టర్ లోకేష్‌తో పాటు పీటీఎం పశువైద్య సిబ్బంది, అంకిరెడ్డిపల్లె రైతులు పాల్గొన్నారు.

నేల మల్లేశ్వర స్వామికి రూ.లక్ష ఆదాయం

నిమ్మనపల్లె, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ అటవి ప్రాంతంలో వెలసిన నేల మల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా రూ.1,04,000లు ఆదాయం చేకూరినట్లు ఆలయ ఏవో సుజాత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈ ఆదాయాన్ని ఆలయం వద్ద భక్తులకు చేపట్టే అన్నదాన కార్యక్రమానికి,ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెడ్డన్న, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పనిముట్లు ఇవ్వాలి

మదనపల్లె అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి):స్థానిక మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద మున్సిపల్ కార్యాలయానికి కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా వర్కర్స్‌కు పనిముట్లు ఇవ్వడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మస్తాన్, కార్యదర్శి నాగరాజ, నాయకులు పాల్గొన్నారు.

నేడు మాజీ సైనికుల సర్వసభ్య సమావేశం

మదనపల్లె, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆసంఘం డివిజన్ అధ్యక్షుడు కంచెర్ల శ్రీనివాసులునాయుడు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా మన్ననలు పొందుతున్న కూటమి ప్రభుత్వం



టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

మదనపల్లె టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరుస్తూ కూటమి ప్రభుత్వం కూటమి ప్రజల మన్ననలను పొందుతోందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం మదనపల్లె టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఇసుక దందాతో ప్రజలను దోచుకున్నారని, కాని సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక విధానంతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి పెంచారన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలకు ఉచిత బీమా పాలసి అందించిన ఘనత మంత్రి లోకేశ్‌కే దక్కుతుందన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ త్వరలో మదనపల్లెకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్ధన్‌రెడ్డి, మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిలు వస్తున్నారని, అతి పెద్ద సమావేశం నిర్వహిస్తామన్నారు. అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ప్రభాకర్, రాటకొండ మధుబాబు, నాదెళ్ల అరుణ్‌తేజ, సాకే కృష్ణమూర్తి, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: మండలంలోని కాప్పల్లె గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎస్.లోకనాథరాజు, పాయిచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు సోమవారం రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజును మదనపల్లెలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జగన్మోహన్‌రాజుకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీవీ భాస్కర్‌రెడ్డి, ఎస్.వెంకటేష్‌రాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను వేగవంతం చేయండి



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

పెద్దతిప్పసముద్రం జనవరి 20 (ఆం ధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ సూచించారు. సోమవారం ఆయన ఉపాధిహామీ ఏపీవో తిరుపాలప్పతో కలసి మండలంలోని మల్లెల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు, ఫీల్డ్ అసిస్టెంట్ల వివరాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపా ధి పనుల్లో ఎటువంటి అక్రమాలకు పాల్పడినా, మాస్టర్లలో తేడాలు ఉన్నా కూలీల సంతకాలు లేకుండా ఉన్నా అటువంటి వారిపై శాఖా పరమైన చర్య లు తీసుకుంటామన్నారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్లు కదిరప్ప, శంకరప్ప, సతీష్ లతో పాటుగా ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

గుర్రంకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశులు పేర్కొ న్నారు. మండలంలోని తరిగొండ సచివాలయం, గుర్రంకొండ తెలుగు జడ్పీ హైస్కూల్ లో మంగళవారం నుంచి నాలుగు రోజులపా టు ఆధార్ కేంద్రం నడుస్తోందన్నారు.

మదనపల్లెలో ఉచిత వైద్యశిబిరం

మదనపల్లె, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక నక్కలదిన్నెలో సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 24వతేదీ వరకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2:30 నుంచి రాత్రి 8:00గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వైద్య సేవలు ఇతర వివరాల కోసం 9491464633, 9441464633 నెంబర్లను సంప్ర దించాలని వివరించారు.

నర్సింగ్ హోమ్‌కు పిల్లల తరలింపు

నిమ్మనపల్లె, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లె మండలంలోని ఓ గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులను మదనపల్లెలోని నర్సింగ్ హోమ్‌కు తరలించారు. చిన్నారులపై ఇరవై రోజుల క్రితం తండ్రి అఘాయి త్యం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై సోమవారం ఐసీడీఎస్ సీడీపీవో సుజాత, సూపర్‌వైజర్లు గ్రామానికి వెళ్లి చిన్నారులతో పాటు చుట్టుపక్కల స్థానికులను విచారించారు. అనంతరం చిన్నారులను మదనపల్లెలోని నర్సింగ్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు. చిన్నారుల కుటుంబసభ్యుల కోరిక మేరకు తదుపరి భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భానులక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిని ప్రభుత్వమే నిర్వహించాలి

● అఖిలపక్ష సంఘాల నాయకుల డిమాండ్



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రివద్ద నిరసన తెలియజేస్తున్న అఖిలపక్ష నాయకులు

మదనపల్లె అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ప్రభుత్వమే నిర్వహించాలని అఖిలపక్ష సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ఆస్పత్రి ఎదుట అఖిలపక్ష నాయకులు నిరసన చేపట్టారు. ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రిని ప్రైవేట్ పరం చేయవద్దని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప, సీపీఐ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళీ మాట్లాడుతూ మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి దశాబ్దాల చరిత్ర ఉందని, ఎంతో మంది నిరుపేదల ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇలాంటి ఆస్పత్రిని ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచన కూటమి ప్రభుత్వం మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇప్పటికే డాక్టర్లు, స్టాఫ్‌నర్సులను బదిలీలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని కాపాడుకోవడానికి మదనపల్లె పరిసర ప్రాంతాల ప్రజలను కలుపుకుని ప్రజా ఉద్యమంచేపడతామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు రెడ్డి, తిరుమల, నాగరాజ, పృధ్వీరాజ్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

డ్రైవర్స్‌కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తాం



డ్రైవర్స్‌కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం బసినికొండ గ్రామ పంచాయతీ డ్రైవర్స్ కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హామీ ఇచ్చారు. సోమవారం స్థానిక డ్రైవర్స్‌కాలనీ ప్రజల విన్నపం మేరకు ఎమ్మెల్యే కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, మురుగునీటి కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా స్థానికులకు కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయిస్తున్నామని, ఈ ప్రభుత్వం స్థలం కబ్జా కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలో రెండో వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాన్‌బాబు, ఎస్‌ఎం రఫి, హుస్సేన్, పూలకుంట్లహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే ప్రకృతి కూరగాయల స్టాల్స్ ఏర్పాటు



మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ కూరగాయల స్టాల్స్

వాల్మీకిపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా లబ్ధిమవుతున్న నాణ్యమైన, పోషకాలతో కూడిన కూరగాయల స్టాల్స్‌ను ప్రజల కోసమే ఏర్పాటు చేసినట్లు వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటి పేర్కొన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ కూరగా యల స్టాల్స్‌ను తహసీల్దార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ఇదే ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఆకుకూరలు, కూరగాయలను రైతులు స్టాల్స్ ఏర్పాటు చేసి అమ్మకాలు నిర్వహించడం జరుగుతోందని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పురుగుల మందులు వాడని కూరగాయలను కొనుగోలు చేసి ఆరోగ్యాన్ని పాడుకోవాలన్నారు. ఇవే స్టాల్స్ ద్వారా మిల్లెట్స్, ఆవు నెయ్యి, తదితరం అన్ని అందుబాటులో ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ వాణిశ్రీ, ఏవో హేమలత, ఏపీఎం నరోత్తమరెడ్డి, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది స్వాతి, రైతులు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలతో ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్ నవనీత్ కృష్ణన్

కురబలకోట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, అధ్యాపకులు నూతన ఆలోచనలతో ముందుకు సాగాలని రిసోర్సుపర్సన్ నవనీత్ కృష్ణన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సెమీకండెక్టర్ తయారీకి ఈడీఏ సాధనాల ఆచరణాత్మక ఉపయోగంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు అకడ మిక్స్‌పై దూరం తగ్గించడానికి పరిశోధనలు చేపట్టి మంచి ఫలితాలను సాధించాలని కోరారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంతో పోల్చితే ఈసీఈ రంగంలో మెరుగైన ఉద్యోగావ కాశాలు ఉన్నాయన్నారు. ప్రధాని మోదీ స్మార్ట్ సిటీని మంజూరు చేశారని, దీనిలో ఎంబెడెడ్ వీఎల్‌ఎస్‌ఐఏడీఏ టెక్నాలజీలు ఎంతగానో దోహద పడుతాయని వాటిపై పట్టు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి రాజశేఖరన్, నాగజ్యోతి, నాగశ్వేత, చరన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించండి

పెద్దమండ్యం, జనవరి 20(ఆంధ్రజ్యోతి) గ్రామాలలో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని పెద్దమండ్యం ఎంపీడీవో శ్రీధర్‌రావు ఆదేశించారు. మండలంలో పెద్దమడ్యం, వెలిగల్లు కలిచెర్ల గ్రామాలలో సోమవారం ఎంపీడీవో పర్యటించారు. కలిచెర్ల సమీపంలో కొత్తగా నిర్మించిన మురుగునీటి కాలువ పనులు పరిశీలించారు. గతంలో వర్షపు నీరు, మురుగునీరు చేరి దుర్గంధం వస్తోందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఆ ప్రాంతాంలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు పర్యటించారు. అక్కడ నీరు నిలువకుండ చర్యలు తీసుకుంటామని స్థానికులకు అధికారులు హామీ ఇచ్చారు. దీంతో అక్కడ మురుగునీటి కాలువ పనులు పూర్తి కావడంతో ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల్లో వీధుల్లో పేరుకు పోయిన చెత్తచెదారం తొలగింపు పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. చలి కాలంలో ప్రజలు జ్వరాల బారిన పడకుండ ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం, ఖాదర్‌బాష, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో మంచు దుప్పటి



పీలేరును పొగ మంచు సోమవారం ఉదయం 11 గంటలైనా వీడలేదు. దీంతో వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాధారణంగా ఉదయం 7.30 గంటలకు తొలగిపోయే మంచు తెరలు సోమవారం మాత్రం ఉదయం 11 గంటల వరకు కమ్ముకునే ఉన్నాయి. కాగా సంక్రాంతి సెలవుల తర్వాత విద్యాసంస్థలకు తొలిరోజు కావ డంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు ఇళ్లలో నుంచి బయటకు వచ్చిన వారికి కళ్లు పొడుచుకున్నా కనిపించని మంచు స్వాగతం పలికింది. దానికి తోడు 5 అడుగుల దూరంలో ఉన్న వారిని కూడా గుర్తు పట్టలేనంతగా పొగమంచు కురి సింది. ఆదివారం ఉదయం వర్షం ఆశ్చర్యపరచగా సోమవారం మంచు దుప్పటి ఇబ్బంది పెట్టింది. వాతావరణంలో వస్తున్న మార్పులను చూసి చాలా మంది వయోవృద్ధులు 'ఇదేమి చోద్యం' అంటూ నిట్టూర్చారు.

- పీలేరు, ఆంధ్రజ్యోతి

25 మందికి కంటి ఆపరేషన్లు

మదనపల్లె అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లె లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం లయన్స్ కంటి ఆస్పత్రిలో 25 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ అప్పినపల్లె భాస్కరాచారి మాట్లాడుతూ అంధత్వాన్ని రూపుమాపే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పీఆర్వో గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటిస్థలం వద్ద దౌర్జన్యం

మదనపల్లె అర్బన్ జనవరి 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో తనకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలం వద్ద వైసీపీ కౌన్సి లర్ శ్రీనివాసులు దౌర్జన్యం చేస్తున్నాడని బాధితుడు వాపోయారు. ఆ మేరకు సోమవారం తనకు న్యాయం చేయాలని మదనపల్లె టూటౌన్ సీఐ రామ చంద్రకు ఫిర్యాదు చేశానని తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

మదనపల్లె అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఏపీ మాథ్స్ పార్క్ అన్నమయ్య జిల్లా వారి ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేసినట్లు మదనపల్లె వాసవీక్లబ్ అధ్యక్షుడు పొన్నగంటి అమరనాథ్ తెలిపారు. సోమవారం మదనపల్లె జడ్పీ హై స్కూల్‌లో ఉపాధ్యాయులతో కలిసి మదనపల్లె వాసవీ క్లబ్, వాసవీవనితా సెంట్రల్ సహకారంతో జిల్లా మొత్తం వెయ్యి కాపీలను విద్యార్థులకు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కెఎస్‌కృష్ణమూర్తి, వెంకటేస్‌బాబు, లక్ష్మీపతి, చంద్రశేఖర్, కార్యదర్శి మునిరాజా, ట్రెజరర్ కూరపాటి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.